RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 52 Issue No. 52 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: గురువారం 19-02-2026 Thursday, February 19 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

### అరెస్ట్ చేయకుండా వేసిన పిటిషన్ తిరస్కరణ



**అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో సినీనటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) ఛాన్సలర్ మోహన్‌బాబుకు ఏపీ హైకోర్టులో ఎదురు దెబ్బ మిగతా 2లో..



# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

- ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి
- ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సిఎం బాబు, డిప్యూటీ సిఎం పవన్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ మిగతా 2లో..

## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

### తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ

### మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రాల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది. తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీకాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు, తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు, బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, మిగతా 2లో..

## తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

### రంగంలోకి దగిన బాంబ్ స్క్వాడ్ బృందాలు



**హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో మిగతా 2లో..

## టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

### గొడవలు చేయడం కాదు..ఆధారాలతో రండి

### వైసిపి సభ్యులకు హోంమంత్రి అనిత సవాల్



**అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ అసెంబ్లీలో తాము చర్చకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చర్చ కాకుండా రచ్చ చేయాలనుకుంటున్న వైసిపి సభ్యుల తీరుపై మండిపడ్డారు. చేసిన పాపాలు బయటపడకుండా చేస్తున్న రాద్ధాంతంగా అభివర్ణించారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని సవాల్ చేశారు. ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు ఛాలెంజ్ చేశారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంపై చర్చకు సిద్ధమని మంగళవారం సభలోనే మంత్రి అచ్చె న్నాయుడు ప్రకటించారని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని.. రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని మిగతా 2లో..

## కొలంబోకు సొంత డబ్బుతోనే వెళ్లా

### వైకాపా ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇటీవల కొలంబోలో జరిగిన భారత్-పాక్ మ్యాచ్‌కు తన సొంత ఖర్చుతో వెళ్లానని ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ధనం ఖర్చు చేసి వెళ్లినట్లు వైకాపా సొంత మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. తనకు అంతటి దుస్థితి పట్టలేదన్నారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగతమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తినీ.. నీ డబ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్? అని లోకేశ్ తనదైన శైలిలో పేర్కొన్నారు. శాసన మండలిలో వైకాపా పక్ష నేత బొత్స సత్యనారాయణ ఆ పార్టీ సభ్యులపై పట్టు కోల్పోయారని నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ మిగతా 2లో..

## దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ మిలాఖత్

### తరచూ వారితో సమావేశం అవుతున్నారు... విదేశీ పర్యటనల్లో ఇదే జరుగుతోంది

### కేంద్రమంత్రి కిరణ్ రిజజు సంచలన వ్యాఖ్యలు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత , లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌గాంధీకి భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. విదేశీ పర్యటనల సమయంలో విపక్షనేత వేర్పాటువాదులు, మావోయిస్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జిసోరస్ లాంటి వ్యక్తులతో సమావేశమవుతున్నారని అన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే ఆయన జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా మిగతా 2లో..

## గుడివాడ సీసీఎస్ పీఎస్ గోదాములో అగ్నిప్రమాదం



**గుడివాడ, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణా జిల్లా గుడివాడ సీసీఎస్ పోలీస్‌స్టేషన్ గోదాములో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సీజ్ చేసిన వాహనాలు, మద్యం సీసాలు, స్వాధీనం చేసిన వస్తువులు దగ్ధమయ్యాయి. సీసీఎస్ పీఎస్ భవనం పక్కనే తహసీల్దార్, ట్రెజరీ, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. డీఎస్పీ ధీరజ్ వినిల్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై డీఎస్పీ విచారణకు ఆదేశించారు.

## పాలకులకు ఐఏఎస్ ఐపీఎస్‌లు బానిసులాగా మారవద్దు

### ట్రంప్‌కు దేశాన్ని తాకట్టు పెట్టిన మోడీ.... వ్యవసాయ, చేనేత రంగాలకు తీరని నష్టం

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడి




**కాకినాడ, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమెరికా విధానాలకు, ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు వల్ల దేశంలోని వ్యవసాయ, చేనేత రంగం నాశనం అయిపోతుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ విధానాలకు సాగిలాపడి ప్రధాని మోడీ బానిసగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. కాకినాడలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేసింది వాళ్లకు కోట్లాది రూపాయలను రుణాలు మాఫీ చేస్తుందన్నారు బ్యాంకులకు తాకట్టు పెట్టిన వారిలో 26 మంది ఉండగా వారిలో 27మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారిని సుమారుగా వారికి 27 లక్షల కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టారన్నారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆ రుణాలను మాఫీ చేస్తుందన్నారు. ప్రపంచానిని కుదిపి వేసిన ఎప్స్టీన్ ఫైల్స్లో మోడీ పేరు రావడంతోనే ఆయన అమెరికాకు సాగిల పడి దేశ పరువు తీసారన్నారు. కార్పొరేట్ల మేలు కోసం అటవీ చట్టాలను మార్పు చేసి అడవి సంపదను వారికి దోచిపెడుతున్నారన్నారు. ఆదివాసికి చెందిన రాష్ట్రపతితో అటవీ చట్టాన్ని మార్పు చేసి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి నక్సల్ పేరుతో గిరిజనులను చంపేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బీజేపీతోనే ఉన్నాయని వీరి పోరాటం రాష్ట్రంలో కూటమి, వైసీపీలుగా మిగతా 2లో..

## కులవర్ధన్‌ను రక్షక్ వాహనంలో తరలిస్తుండగా తప్పించుకున్నాడు: ఎస్పీ



**మదనపల్లె, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చిన్నారిపై హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని ఎస్పీ ధీరజ్ చెప్పారు. నిందితుడిని మంగళవారం తీసుకెళ్తుండగా పోలీసుల నుంచి తప్పించుకున్నాడన్నారు. మదనపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. "కులవర్ధన్‌ను రక్షక్ వాహనంలో తరలిస్తుండగా తప్పించుకున్నాడు. ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా కనసానివారిపల్లె చెరువులో బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. దీనిపై అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాం" అని ఎస్పీ ధీరజ్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయిలు

# దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ మిలాఖత్

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షాలు సిద్ధమవడంపై కూడా రిజిజు మాట్లాడారు. ప్రతిపక్షాలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్‌గాంధీ వారి వ్యాఖ్యలతో చర్చలకు అంతరాయం కలిగిస్తారని అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ ఆయనలాంటి ప్రతిపక్ష నేతను చూడలేదని రిజిజు విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలు చేస్తూ వాకౌట్ చేయడం వంటి చిన్న పిల్లల చర్యలు చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ ఇలా సభకు అంతరాయం కలిగించడంవల్ల ప్రజల సమస్యల గురించి మాట్లాడాలనుకునే వారికి అవకాశం దక్కట్లేదని చెప్పారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని, జాతీయ ప్రయోజనాలతో రాజీ పడుతోందని ఇటీవల లోక్‌సభలో రాహుల్ ఆరోపించారు. అయితే రాహుల్ తన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ పార్లమెంట్ సభ్యుడు నిషికాంత్ దూబే విమర్శించారు. ఫిబ్రవరి 12న లోక్‌సభలో రాహుల్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

తగిలింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. కిడ్నాప్‌నకు ముందు, తర్వాత వర్సిటీ పీఆర్వో సతీష్‌తో మోహన్‌బాబు మాట్లాడారని, మెసేజ్‌లు పంచుకున్నారని పోలీసులు చెబుతున్న విషయాన్ని గుర్తుచేసింది. ప్రధాన వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామంటూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మార్చి 3కు వాయిదా వేశారు. ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్ బాబు ప్రత్యక్ష ప్రమేయం ఉందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే బౌన్సర్లను అరెస్ట్ చేశారు.

## టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ సంస్థ 34 సంవత్సరాలుగా ఉందని.. ఆ సంస్థ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధనను తమ ప్రభుత్వం పెట్టిందని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని... ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి పేపర్‌లో యాడ్‌ల కోసం రూ.600 కోట్ల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని హోంమంత్రి అనిత ఆరోపించారు. వైసీపీ నేతల్లాగా తమకు దుర్బుద్ధి లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులే కల్తీ లడ్డూ మీద వాయిదా తీర్మానం, ఇందాపూర్ డెయిరీ పైన వాయిదా తీర్మానం ఇచ్చారని ప్రస్తావించారు. మదనపల్లి చిన్నారి ఘటన విషయంలో నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అతను చేసింది తప్పని.. అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## కొలంబోకు సొంత డబ్బులతోనే వెళ్లా

నిర్వహించారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు పరస్పర విరుద్ధంగా రెండు వాయిదా తీర్మానాలు ఇచ్చారని చెప్పారు. ఒకరు కల్తీ లడ్డూపై.. మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చ కోరుతున్నారన్నారు. వారి కొట్లాటలో ఎవరు పైచేయి సాధిస్తారోనని తమకు ఆసక్తిగా ఉందని చెప్పారు. సభలో తమ స్ట్రాటజీ ఏంటో చూస్తారుగా అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ





(మొదటి పేజీ తరువాయి)
జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణించారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

# పాలకులకు ఐఏఎస్ ఐపీఎస్‌లు బానిసులాగా మారవద్దు

(మొదటి పేజీ తరువాయి)
ఉన్నా ఢిల్లీలో మాత్రం కలిసి ఉంటున్నారని చెప్పారు. బిల్ గేట్స్ను తీసుకువచ్చి అమరావతిలో అరటి తోటలను చూపించిన సీఎం చంద్రబాబు కేంద్రంలో వ్యవసాయ రంగానికి మోసం చేస్తున్న మోడీని మాత్రం నిలువరించడంలో భయపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూములను కారు చౌకగా కార్పోరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని ఇలా కార్పోరేట్లకు ఊడిగం చేయడంలో మోడీ, బాబు పోటీ పడుతున్నారని నారాయణ ఎద్దేవా చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయా నాయకులకు బానిసలుగా ఉండొద్దని సూచించారు. నాయకులు మాట విని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి నేటికీ కూడా శిక్షను ఎదుర్కొంటున్నారని అందువల్ల ఆ అధికారులు స్వతంత్రంగా వ్యవహరించాలని నారాయణ కోరారు. తిరుమల లడ్డు కల్తీ వ్యవహారాల్లో బాధ్యులైన వారిని శిక్షించి కోట్లాది రూపాయలు చేతులు మారిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై పోరాటం చేసి సీపీఐని బలోపేతం చేస్తామని నారాయణ చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

**యానాం ఎమ్మెల్యే అవినీతిపరుడిగా మారాడు**

పుదుచ్చేరి రాష్ట్రంలోని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ బీజేపీ పంచన చేరి అత్యంత అవినీతిపరుడుగా మారాడని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు.

విలేకర్ల సమావేశంలో నారాయణ ఇలా స్పందించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గొల్లపల్లి శ్రీనివాస అశోక్ కొద్దిరోజుల తర్వాత బీజేపీ పంచన చేరి అత్యంత అవినీతిపరుడుగా మారారన్నారు. ఆ ఎన్నికలలో అశోక్ తరపున తాను ప్రచారం చేశానని చాలా మంది అశోక్ ప్రచారంనకు రావద్దని వారించిన తాను వచ్చి గెలుపులో కీలక పాత్ర పోషించానన్నారు. ఈసారి అశోక్ పోటీ చేస్తే అతని ఓటమికి ప్రచారం చేస్తానని నారాయణ పేర్కొన్నారు.

# విభజనతో 80వేల కోట్లు రావాల్సి ఉంది

### వీటి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి... కూటమి నేతలకు ఉండవల్లి సూచన

**రాజమండ్రి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రావాల్సిన రూ.80 వేల కోట్ల కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఉండవల్లి అరుణ్ కుమార్ సూచించారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా కూడా విభజన హామీలు ఇంకా అమలు కాలేదని పేర్కొన్నారు. రాజమండ్రిలో బుధవారం మీడియాతో ఉండవల్లి మాట్లాడారు. విభజన వల్ల ఏపీకి జరిగిన అన్యాయంపై పోరాడటానికి సుప్రీంకోర్టులో ఓ అడ్వొకేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు. తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయం చేయటం మంచిది కాదన్నారు. లడ్డూ కల్తీ చేసిన వారిపై సిట్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఉన్న హెరిటేజ్, భారతి సిమెంట్స్ ప్రధాన కార్యాలయాలను అమరావతికి తీసుకురావాలని సూచించారు. వైసీపీ తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా కక్ష



సాధింపు చర్యలకు వెళ్లకూడదని హితవు పలికారు. చంద్రబాబును జైల్లో పెట్టడం వల్ల జగన్‌కు నష్టమే జరిగిందని.. వైసీపీ నేతలను జైల్లో పెడితే చంద్రబాబుకు కూడా నష్టమే జరుగుతుందని చెప్పుకొచ్చారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను ఇబ్బందులకు గురి చేయటాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. కర్నూలు కోవాబన్ వలీకి మంత్రి నారా లోకేశ్ అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. బీజేపీ అలయన్స్‌లో ఉండి ముస్లింకి లోకేశ్ అండగా నిలవడంపై అభినందించాలని పేర్కొన్నారు.

# సీబీజీ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కంచికచర్ల మండలం, పరిటాలలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్ న్యూ ఎనర్జీ - కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం సందర్శించారు. 30 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్లాంటును త్వరలో గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించే అవకాశమున్నందున ప్లాంటులో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకు 22 టన్నుల సీబీజీ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంటును సిద్ధం చేస్తున్నట్లు ప్లాంటు సిబ్బంది వివరించారు. స్థానిక వ్యవసాయ వ్యర్థాలు, మునిసిపల్ ఘన వ్యర్థాలు వంటి వాటిని ఉపయోగించి పర్యావరణ హిత ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు ఇలాంటి ప్లాంటులు దోహదం చేస్తాయన్నారు. ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కూడా చేయూతనిస్తాయన్నారు. కర్బన ఉద్గారాలకు కళ్లెం వేయడంతో పాటు రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీబీజీ ప్లాంట్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, సంస్థ డీజీఎం శ్రీకాంత్, మేనేజర్ శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిట్టిబాబు ఉన్నారు.

# మదనపల్లె ఘటనను సీరియస్‌గా తీసుకున్నాం

### హోంమంత్రి అనిత వెల్లడి

**అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చిన్నారిపై ఘాతుకాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని హోంమంత్రి అనిత తెలిపారు. గంజాయికి అలవాటు పడిన కులవర్ధన్ ఈ ఘటనకు పాల్పడ్డాడన్నారు. తర్వాత మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడించారు. మదనపల్లెలో చిన్నారిపై హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని ఎస్పీ ధీరజ్ చెప్పారు. నిందితుడిని మంగళవారం తీసుకెళ్తుండగా పోలీసుల నుంచి తప్పించుకున్నాడని.. ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా కనసానివారిపల్లె చెరువులో బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైందని చెప్పారు. ఇదిలావుంటే అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చిన్నారిపై హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని ఎస్పీ ధీరజ్ చెప్పారు. నిందితుడిని మంగళవారం తీసుకెళుతుండగా పోలీసుల నుంచి తప్పించుకున్నా డన్నారు. మదనపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

# అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

### వారితో మాటామంతీ నిర్వహించిన స్పీకర్



**అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి బుధవారం కూడా కొందరు విద్యార్థులు వచ్చారు. ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు. అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. చర్చలు బాగా జరుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. సీఎం చంద్రబాబును చూడాలని ఉందని చెప్పారు విద్యార్థులు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం రావడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్కడికి వెళ్లారని అధికారులు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు చూసిన పలువురు విద్యార్థులు తమకు పోలవరం ప్రాజెక్టు కూడా చూడాలని ఉందన్నారు. ఈసారి నుంచి విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టుని కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాటిచ్చారు. తమకు అసెంబ్లీ సమావేశాలు నేరుగా చూడటం కొత్త అనుభూతి కలిగిందని విద్యార్థులు పేర్కొన్నారు.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి ఊరట

### బెయిల్ మంజూరు చేసిన గుంటూరు కోర్టు

**గుంటూరు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఊరట లభించింది. గుంటూరు కోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. 2023 సంవత్సరంలో సంక్రాంతి పండుగ సమయంలో మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలు టికెట్లు అమ్ముకుంటున్నారని జనసేన నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు రాంబాబుపై వెంటనే కేసు నమోదు చేసి, విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్కులేషన్ స్కీమ్స్ నిషేధ చట్టం కింద పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇదే కేసుకు సంబంధించి తాజాగా పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. గత కొద్దిరోజుల నుంచి అంబటి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌పై బుధవారం గుంటూరు కోర్టు విచారణ జరిపింది. పోలీసుల కస్టడీ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. అంబటికి బెయిల్ మంజూరు చేసింది.

## వైసిపి ఎమ్మెల్యేతో టిడిపి ఎమ్మెల్యేల సరదా

**అమరావతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అసెంబ్లీ ఆవరణలో తెదేపా ఎమ్మెల్యేలకు వైకాపా ఎమ్మెల్యే చంద్రశేఖర్ తారసపడ్డారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, అశోక్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలను వైకాపా ఎమ్మెల్యే పలకరించారు. ఈ సందర్భంగా వీరి మధ్య సరదా చిట్‌చాట్ జరిగింది. బిల్ గేట్స్ స్థాయి తెలియకుండా విమర్శించే స్థాయికి మీ పార్టీ దిగజారిపోయిందని తెదేపా ఎమ్మెల్యేలు ఆయనను అడిగారు. అసెంబ్లీకి వచ్చి బ్జడెట్ లెక్కలు అడగకుండా.. ప్రెస్‌మీట్ పెట్టి బిల్‌గేట్స్ టీ, కాఫీ ఖర్చులంటూ నవ్వులపాలయ్యారుగా.. అని ఎంఎస్ రాజు ఎద్దేవా చేశారు. అన్నీ తెలిసే నన్ను ఆడుకుంటున్నారుగా... మీకో నమస్కారం అంటూ చంద్రశేఖర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

## హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు పూర్తి

### కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్థులు

**కడప, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా మదనపల్లిలో దారుణ హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య ముగిశాయి. మదనపల్లిలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన కడప జిల్లా వీరబల్లి మండలం రాగిమానుదిన్నెపల్లిలో నిర్వహించారు. అంత్యక్రియలకు బంధువులు, స్థానికులు, అన్నమయ్య, కడప జిల్లాల టీడీపీ నేతలు హాజరయ్యారు. అందరూ కన్నీటితో బాలికకు చివరి వీడ్కోలు పలికారు. అంత్యక్రియలకు ముందే, ఈ కేసులో నిందితుడు కులవర్ధన్ మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా కరసానివారిపల్లి చెరువులో అతడి మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో ముదివేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు దీనిని ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాలిక అంత్యక్రియలకు ముందే నిందితుడు కులవర్ధన్ మరణంపై మృతురాలి బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

### ప్రధాని మోడీతో భేటీ అయినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** సాంకేతిక ప్రపంచంలో భారత్ తన ముద్ర వేస్తోంది. ఇందులో భాగంగా.. గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బుధవారం న్యూఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోదీ-సుందర్ పిచాయ్ మధ్య జరిగిన ఈ సమావేశం ప్రధానంగా కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక సదుపాయాల చుట్టూ సాగినట్లు సమాచారం. భారత్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు చేరుకున్నారు. సుందర్ పిచాయ్ ఈ శిఖరాగ్ర సమావేశంలో 20న కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం భారత దేశానికి తిరిగి రావడం ఆనందంగా ఉంది. ఎప్పటిలాగే చాలా మంది మనస్ఫూర్తిగా



స్వాగతం పలుకుతున్నారు' అంటూ రాసుకొచ్చారు. ఈ సదస్సులో 110కి పైగా దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి!

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామిలాను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్మాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్ మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీల కారణంగా అనేక పట్టణాల్లోని వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తున్నది. నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు సరైన నిర్వహణలేక తరచూ లీకేజీలు అవుతున్నాయి. వార్డుల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేడు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ జాడనే లేదు. ఈ సమస్యలన్నీ ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. ఏళ్లుగా రాజ్యమేలుతున్నాయి. సరైన పద్ధతిలో పరిష్కారం చేయలేదు. వీటిని పరిశీలించి పరిష్కరించడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి మేలైన పాలనకు బాటలు వేయాలి.

# చిన్నారి హత్యకేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య

■ చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసుల గుర్తింపు

■ అతనది ఆత్మహత్యే అని ఎస్పీ నిర్ధారణ

**అన్నమయ్య,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** మదనపల్లిలో ఏడేళ్ల చిన్నారి దారుణ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కులవర్ధన్ మృతదేహం కురబలకోట మండలం కనసానిపల్లె చెరువులో లభ్యమైంది. అతను ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. చిన్నారి హత్య కేసుపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాతో మాట్లాడుతూ.. కురబలకోట మండలం కనసానిపల్లె చెరువులో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతదేహాన్ని కులవర్ధన్‌గా అతని బంధువులు గుర్తించారని ఎస్పీ చెప్పారు. మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కులవర్ధన్ బంధువులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. మంగళవారం కులవర్ధన్‌ను అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా.. పోలీసుల నుంచి తప్పించుకుని అతడు పారిపోయాడని తెలిపారు. అతని ఆచూకీ కోసం మూడు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. బుధవారం ఉదయం చెరువులో కులవర్ధన్ మృతదేహం తేలినట్లు తెలిసిందన్నారు. ప్రాథమిక విచారణలో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు.

# యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

## స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూలవర్యుల అనుమతితో నిజాభిషేకం, విశ్వక్సేనారాధన, జలపూజ, పుట్టమట్టిలో నవధాన్యాలు నాటడంతోపాటు స్వస్తివాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. తొలి పూజల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి.



బుధవారం 18 న స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధన, సాయంత్రం మత్స్యగ్రహణం, అంకురార్పణ ఉంటుంది. 19న ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం భేరి పూజ చేపడతారు. ఫిబ్రవరి 20 న ఉదయం మత్స్యావతార అలంకారం, సాయంత్రం శేష వాహన సేవ వేదపారాయణములు. రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21 న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంసవాహన సేవ,22 న శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్న వాహనసేవ చేపడతారు. 23 న ఉదయం గోవర్ధన గిరి ధారి, సాయంత్రం సింహ వాహన సేవ ఉంటుంది. 24న జగన్మోహినీ అలంకార సేవ, అశ్వ వాహనం పై రాత్రి ఎదుర్కోలు వేడుక చేస్తారు. 25న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 26న రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం,27 న స్వామి వారి చక్రతీర్థ స్నానం. ఫిబ్రవరి 28 న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నారు.

# ఇద్దరు మావోల లొంగుబాటు

## పునరావాసం కల్పిస్తామన్న అల్లూరి జిల్లా ఎస్పీ

**పాడేరు, ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** ఛత్తీస్‌గఢ్‌లోని మాడేరియా డివిజన్ కమిటీకి చెందిన ఇద్దరు మావోయిస్టులు ఆంధ్ర పోలీసుల ఎదుట లొంగిపోయారు. బుధవారం అల్లూరి జిల్లా ఎస్పీ అమితి బర్దార్ ఎదుట వీరు స్వచ్ఛందంగా లొంగిపోయారు. అనంతరం జిల్లా ఎస్పీ బర్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, పునరావాస పథకాలను పూర్తిగా వినియోగించుకుని గౌరవప్రదమైన, శాంతియుత జీవితం గడపాలని లొంగిపోయిన మావోయిస్టులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ ప్రాయోజిత శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని వారికి సూచించారు. అలాగే ఇతర మావోయిస్టులు సైతం సమీప పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. అలా కాకుంటే కుటుంబ సభ్యుల ద్వారా.. నేరుగా సీనియర్ పోలీస్ అధికారులను సంప్రదించాలని మావోయిస్టులకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారని తెలిపారు. కడితే హిడిం అలియాస్ అంజు అలియాస్ కరుణ- డివిజినల్ ఏరియా కమిటీ మెంటర్ , బద్సే భీమా అలియాస్ మనీష్ ఏరియా కమిటీ మెంటర్ గా పని చేశారని ఎస్పీ వివరించారు. వీరిద్దరు పలు నేరాలలో నిందితులను పోలీసులు ఈ సందర్భంగా చెప్పారు. మరో వైపు తాము లొంగిపోవడానికి గల కారణాలను ఈ ఇద్దరు మావోయిస్టులు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల ఆపరేషన్లు తీవ్రతరం చేశారని చెప్పారు. కొత్త పోలీసు శిబిరాల ఏర్పాటు చేయడం వల్ల మావోయిస్టుల కదలికలు పరిమితం అయ్యాయని వివరించారు. నేపథ్యంలో ప్రాణ భయం ఏర్పడిందని వివరించారు. మావోయిస్టుల పట్ల ప్రజల మద్దతు తగ్గిపోవడం కూడా ఒక కారణమన్నారు. అలాగే సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోయినట్లు చెప్పారు. నిరంతర లొంగుబాట్ల కారణంగా పార్టీ సిద్ధాంతాలపై నిరాశ పెరిగిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో పలువురు సీనియర్ మావోయిస్టు నేతలు మరణించడంతో తమ కార్యకలాపాల తీవ్రంగా బలహీనపడ్డాయని చెప్పారు. ప్రభుత్వ పునరావాస విధానాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ఆకర్షణీయమైన లొంగుబాటు ప్రయోజనాలు – ఆర్థిక సహాయం, భూమి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కలగడంతో తీవ్రవాదాన్ని విడిచి జన జీవన స్రవంతిలోకి తిరిగి వచ్చామన్నారు.

# యూట్యూబ్ వీడియో ప్లాట్‌ఫామ్‌లో సాంకేతిక సమస్య

## పలుదేశాల్లో వీడియో ప్లేకు అంతరాయం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో అంతరాయం నెలకొంది. మంగళవారం రాత్రి నుంచి ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. మొబైల్, కంప్యూటర్లలో యూట్యూబ్ ఓపెన్ చేస్తుంటే ఎర్రర్ అని చూపిస్తోంది. కొంతమందికి యూట్యూబ్ వీడియోలు లోడ్ కావడం లేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అమెరికాలోనే మూడు లక్షలకు పైగా యూజర్లు డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవుట్‌టేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఈ సమస్య మంగళవారం రాత్రి 8 గంటలకు అమెరికాలో మొదలైంది. తమ వెబ్‌సైట్‌కు అమెరికాలో 3,20,000 కంటే ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. ఇండియా నుంచి కూడా 18 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీడియోలు ప్లే కావడం లేదని, సెర్చ్ రిజల్ట్ కనిపించడం లేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. యూట్యూబ్ సాంకేతిక సమస్యలపై ఆ సంస్థ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. సమస్కయ పరిష్కారం కోసం పనిచేస్తున్నామని పేర్కొంది.

# వేగంగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

## ప్రమాదంలో మెదక్ వ్యాపారి మృతి

**మెదక్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** మెదక్ జిల్లా కొల్చారం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడిని మెదక్ పట్టణానికి చెందిన వీవీ సిల్క్స్ బట్టల షాపు యజమాని వనపర్తి రోహిత్ గుప్తా (50) గా గుర్తించారు. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌గా గుర్తించారు. వీరు విజయవాడకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. యాక్సిడెంట్ గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్

## స్టే ఎత్తివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ... కిడ్నాప్‌పైన కౌన్సిలర్ యాదగిరి హాజరు

## స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న కోర్టు

**హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది. మున్సిపల్ ఎన్నికపై గతంలో ఉన్న స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఈసీ, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ ఎన్నికపై రెండు రోజుల క్రితమే హైకోర్టు స్టే విధించగా.. దాన్ని ఎత్తివేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి మిస్సింగ్‌పై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరుగగా.. యాదగిరిని కోర్టు ముందు హాజరుపర్చారు ఇబ్రహీపట్నం పోలీసులు. అతడి స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డ్ చేసింది. బీఆర్ఎస్ నేతలు తనను బలవంతంగా చీరాలకు తీసుకెళ్లి రిసార్ట్‌లో బంధించారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు దాదాపు 12 గంటల పాటు హైదరాబాద్ మొత్తం తిప్పి చీరాలకు తీసుకెళ్లారని యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం పంచాయితీ తెలంగాణ హైకోర్టుకు చేరింది. కోర్టు ఆదేశాలతో ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని హైకోర్టులో హాజరుపరిచారు పోలీసులు. ఆకుల యాదగిరి కనిపించడం లేదని కుటుంబసభ్యులు.. హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. యాదగిరిని హైకోర్టు ముందు హాజరుపరచాలని రెండు రోజులు క్రితం న్యాయస్థానం ఆదేశించింది. బుధవారం కౌన్సిలర్ యాదగిరిని కోర్టులో హాజరుపర్చారు పోలీసులు. దీంతో హైకోర్టు ముందు యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన తర్వాత 12 గంటలపాటు హైదరాబాద్‌లో తిప్పారని.. బలవంతంగా తనను చీరాల తీసుకెళ్లారని చెప్పారు యాదగిరి. రెండు రోజులపాటు చీరాలలోని రిసార్ట్‌లో ఉంచారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులతో నిన్న కౌన్సిల్ మీటింగ్‌కు హాజరైనట్లు ఆకుల యాదగిరి.. కోర్టుకు తెలియజేశారు. అతని స్టేట్‌మెంట్ పూర్తి అయిన తర్వాత హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రోవైపు క్యాంపు పేరుతో తన భర్తను కిడ్నాప్ చేశారని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆకుల యాదగిరి భార్య వసంత ఫిర్యాదు చేశారు. దీంతో యాదగిరి మిస్సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ 363 కింద కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అతని తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డిపై ఆకుల యాదగిరి భార్య అనుమానాలు వ్యక్తం చేశారు. స్టే ఎత్తివేయడంతో ఇక ఎన్నికకు లైన్ క్లీయర్ అయ్యింది.

# క్యాతనపల్లిలో కొనసాగిన బంద్

## బాల్క సుమన్ ఇంటి వద్ద పోలీసుల హంగామా

**మంచిర్యాల,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ఆడబిడ్డలపై మీద కాంగ్రెస్ దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్, సీపీఐ ఆధ్వర్యంలో బంద్ కొనసాగుతోంది. మున్సిపాలిటీలోని వ్యాపారులు, వివిధ సంఘాలు, ప్రజలు ప్రజా తీర్పుకు మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. బంద్ సందర్భంగా మున్సిపాలిటీలో భారీగా పోలీసులు మోహరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యను హౌస్ అరెస్టు చేశారు. ఇక నిన్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసు సిబ్బందిపై దాడి చేశారని బాల్క సుమన్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ఆయన ఇంటి ముందు చేరుకున్నారు. ఈ విషయం తెలిసి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. దీంతో బాల్క సుమన్ ఇంటి ముందు ఉద్రిక్తత నెలకొంది

# బహుళ ప్రయోజనాల సూక్ష్మ సేద్యం.. రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు

## అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూక్ష్మ సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయడం, అధిక దిగుబడులు సాధించడం వంటి బహుళ ప్రయోజనాలు ఉంటాయని.. ఈ నేపథ్యంలో అన్నదాతలు ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ సేద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, అధికారులతో కలిసి ఎ.కొండూరు మండలం, రేపూడి గ్రామ పంట పొలాలను సందర్శించారు. సూక్ష్మ సేద్యం పథకం ద్వారా ప్రయోజనం పొందుతూ రైతు జి.విష్ణువర్ధన్‌రెడ్డి సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను, పరికరాలను పరిశీలించారు. పథకం ప్రయోజనాలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో సాగునీటి యాజమాన్యం చాలా ప్రధానమైనదని.. సాగునీటి వనరుల సద్వినియోగంలో బిందు సేద్యం, తుంపర సేద్యం చాలా కీలకమైనవన్నారు. 2025–26లో 2,200 హెక్టార్లకు రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలను అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకాన్ని



విజయవంతంగా అమలుచేస్తున్నామన్నారు. ఈ లక్ష్యానికి మించి కూడా 3,500 హెక్టార్ల వరకు రైతులకు ప్రయోజనం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏడు కంపెనీల ద్వారా పరికరాలు అమర్చుతున్న వివరించారు.

సాగునీరు, కరెంటు వినియోగంలో 50 శాతం పొదుపుతో పాటు ఉన్న నీటితో ఎక్కువ విస్తీర్ణానికి నీరు అందించడం సూక్ష్మ సేద్యంతో సాధ్యమవుతుందని.. భూసారానికి, భూ సమతుల్యతకు ఎలాంటి హానీ కలగకుండా సాగువ్యయంలో దాదాపు 40 శాతాన్ని ఈ విధానంతో ఆదా చేసుకోవచ్చన్నారు. మామిడి, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, కొబ్బరి వంటి పంటలతో పాటు కూరగాయలు, పూల తోటలకు కూడా సూక్ష్మ సేద్యం బాగుంటుందన్నారు. సూక్ష్మ సేద్యం వల్ల ఎకరా మొక్కజొన్నకు దాదాపు ఏడు క్వింటాళ్ల మేర అదనపు దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా మొక్కజొన్న సాగుకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాలు, ఏపీ ఎంఐపీ కార్యాలయం ద్వారా వివరాలు పొంది, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరం మేరకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల స్థూల జోడింపు విలువ (జీవీఏ)లో వృద్ధికి సూక్ష్మ సేద్యం విధానాలు కూడా ఉపయోగపడతాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ వెంట ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎం.సుభాని, ఉద్యానశాఖ అధికారి నరేంద్ర కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రంగారావు, సూక్ష్మ సేద్య పథకం జిల్లా కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# ధనియాల కషాయంతో కీళ్ల నొప్పులు, వాపుకు ఉపశమనం



ధనియాలు భారతీయ వంటశాలలలో సర్వసాధారణం, ప్రకృతిలో చాలా బహుముఖంగా ఉంటాయి. మరిగే నీటిలో ధనియాలు కలుపుకోవడం వల్ల నీరు డికాషన్ లేదా కషాయం తయారవుతుంది, దీన్ని తాగడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయి. మీరు దీన్ని ఎలా తయారు చేయవచ్చో తెలుసుకోవడానికి ఇక్కడ చదవండి. ధనియాలు ప్రకృతిలో విభిన్న లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ విత్తనాలను పచ్చిగా ఉపయోగించవచ్చు లేదా పౌడర్‌గా కూడా ఉపయోగించవచ్చు. కొత్తిమీర విత్తనం లేదా దాని నుండి తయారైన పౌడర్‌ను దాదాపు ప్రతి భారతీయ ఇంటిలో వంటలలో ఉపయోగిస్తారు. అవి ఆహారానికి మంచి రుచిని కలిగిస్తాయి. వాటిని పచ్చిగా ఉపయోగించవచ్చు లేదా వాటిని పొడి చేసి ఉపయోగించవచ్చు. ధనియాలను దాదాపు ప్రతి భారతీయ రుచికరమైన పదార్థాలను వండటానికి ఉపయోగిస్తుంటారు. వీటిని వంటల తయారీలో ఉపయోగించడం ద్వారా ఆ వంటలకు రుచి మరియు వాన ఇస్తాయి మరియు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. సుగంధ హెర్బ్ ఫైబర్తో నిండి ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు ప్రేగు కదలికను క్రమబద్ధీకరిస్తుంది.

ధనియాల కషాయంతో కీళ్ల నొప్పులు మరియు వాపుల నుండి ఉపశమనం పొందండి

ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల పంచుకున్న ఒక వీడియోలో, లైఫ్ స్టైల్ కోచ్ ల్యూక్ కౌటిన్హో ధనియాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి మరియు వాపు, కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ నొప్పి మరియు ఉబ్బరం వంటి వాటికి సమర్థవంతమైన ఇంటి నివారణ ఎలా ఉంటుందో గురించి మాట్లాడాడు.

**ధనియాలు ఆరోగ్య ప్రయోజనాలు:** అవి మీకు సహాయపడే అనేక మార్గాలను తెలుసుకోండి

ఒక టేబుల్ స్పూన్ కొత్తిమీర తీసుకొని నీటిలో ఐదు నుంచి ఆరు నిమిషాలు ఉడకబెట్టండి. ఇది సగానికి తగ్గే వరకు మంటను తక్కువగా ఉంచి ఉడికించండి మరియు ప్రతిరోజూ ఒకటి లేదా రెండు కప్పుల ఈ మిశ్రమం తీసుకోండి. ఈ మిశ్రమం నొప్పి మరియు వాపు, కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. సహజ మూత్రవిసర్జనగా కూడా పనిచేస్తుందని నిపుణులు వెల్లడించారు.

మూత్రపిండాలు శరీరం నుండి విష పదార్థాలను బయటకు తీయడానికి సహాయపడే మూత్రవిసర్జన. మీరు కిడ్నీ రోగి అయితే, ధనియాల కషాయం తీసుకునే ముందు మీ వైద్యుడితో మాట్లాడండి.

ధనియాల కషాయం రెగ్యులర్ గా తాగడం వల్ల అధిక రక్తపోటు ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది ఎందుకంటే ఇది రక్తపోటు స్థాయిలను తగ్గిస్తుంది. అధిక రక్తపోటు ఉన్నవారికి ఉపయోగపడతాయి ఎందుకంటే ఇది రక్తపోటు స్థాయిలను తగ్గిస్తుంది. మీరు అధిక రక్తపోటు కోసం మందులు తీసుకుంటుంటే, మీరు దానిని నిపుణుల పర్యవేక్షణలో తీసుకుంటున్నారని నిర్ధారించుకోండి.

ధనియాల కషాయం తాగడం వల్ల శరీరంలో అదనపు నీరు నిలుపుదల నుండి బయటపడటానికి మీకు సహాయపడుతుంది, దాంతో ముఖం వాపు లేదా పాదాల వాపు సమస్య ఉండదు.

**ధనియాల కషాయం:** గమనించవలసిన కొన్ని అంశాలు

మీరు క్రమమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారంతో సహా ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తున్నప్పుడు మాత్రమే మీరు ధనియాల కషాయంలోని నీటి ప్రయోజనాలను పొందవచ్చని కౌటిన్హో నొక్కిచెప్పారు. మంచి ఆరోగ్యాన్ని సాధించడానికి సత్వరమార్గాలు లేవని ఆయన చెప్పారు.

**నిద్రవేళకు ముందు**

నిద్రవేళకు ముందు ధనియాలు ఉడకబెట్టిన నీరు లేదా కషాయం తీసుకోకండి. ఇది సహజ మూత్రవిసర్జనగా పనిచేస్తుంది మరియు రాత్రిపూట మీరు వాష్‌రూమ్‌ను సందర్శించేలా చేస్తుంది, తద్వారా మీ నిద్రకు భంగం కలుగుతుంది. దీనిని నివారించడానికి, మీరు ఉదయాన్నే ఒక కప్పు మరియు మరొకటి మధ్యాహ్నం ఒక కప్పు తీసుకోవచ్చు.

**మధుమేహానికి మందు**

కొత్తిమీరను డయాబెటిక్ రెమెడీ అంటారు. ఇది డయాబెటిస్‌ను నయం చేసే శక్తిని కలిగి ఉంది. కొత్తిమీర నీరు తాగడం ద్వారా రక్తంలో ఇన్సులిన్ స్థాయిని నియంత్రించవచ్చు.

కొత్తిమీర లేదా విత్తనాన్ని రాత్రి మొత్తం నీటిలో నానబెట్టాలి. ఉదయం తాగాలి. కొత్తిమీర ఒక యాంటీఆక్సిడెంట్, మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పరిశోధన నేషనల్ లైబ్రరీ ఆఫ్ సైన్స్‌లో జరిగింది. కొత్తిమీరలో ఇథనాల్ ఉందని నివేదికలో తెలిసింది. సీరం గ్లూకోజ్ లేదా రక్తంలో చక్కెరను తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తుందని నమ్ముతారు.

**బరువు తగ్గించడానికి సహాయపడుతుంది**

మీరు బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే కొత్తిమీరను ఉపయోగించడం ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం, మీరు మూడు టేబుల్ స్పూన్ల కొత్తిమీరను ఒక కప్పు నీటిలో ఉడకబెట్టి, ఫిల్టర్ చేసి, ఆపై సర్వ్ చేయాలి. ఇలా చేయడం వల్ల బరువు తగ్గుతారు.

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది**

గ్రీన్ కొత్తిమీర కడుపు సమస్యలను తగ్గించడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మజ్జిగతో కలిపిన కొత్తిమీర తాజా ఆకులు తీసుకోవడం వల్ల అజీర్ణం, వికారం, విరేచనాలు మరియు పెద్దప్రేగు శోథ సమస్యలు నయం అవుతాయి.

**రుతు రక్తస్రావం నివారించవచ్చు**

ఇది మహిళల నెలసరి సమస్యపై సమర్థవంతంగా పనిచేస్తుంది. రుతుస్రావం అధిక రక్తస్రావం జరిగితే, 6 గ్రాముల ధనియా విత్తనాన్ని అర లీటరు నీరు వేసి చక్కెరను కలుపుతారు.

# ప్రతి రోజూ ఊరగాయ తినవచ్చా?

భారతీయ వంటకాల్లో ఊరగాయలకు ప్రత్యేక స్థానం ఉంది. ఊరగాయలు ఈ రోజు అనివార్యమైన భోజనం. నోటిలోని లాలాజలం రుచి విందులో ప్రతి దాన్ని మించిపోతుంది.

ఇడ్లీ, చపాతి, దోస, రొట్టె వంటి అన్ని రకాల ఆహారాలతో ఊరగాయలు తినడం మన ప్రజలకు అలవాటు. కొంతమందికి నోటిలో ఊరగాయలు తినడం కూడా అలవాటు.

**ఊరగాయ**

ఊరగాయలలో వివిధ రకాలు కూడా ఉన్నాయి. క్యారెట్లు, మామిడి, ఉల్లిపాయలు, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, చిక్‌పీస్, నిమ్మకాయలు, ఊరగాయలు, కూరగాయలు.

**నానావేజ్ ఊరగాయలు**

నిజానికి, మన భారతీయులు చేపలు మరియు చికెన్లను కూడా ఊరగాయ చేయడం ప్రారంభించారు. భారతీయ వంటకాలలో ఉన్న ఊరగాయలను అల్పాహారం, భోజనం, విందులలోకి ఉపయోగిస్తారు. ఊరగాయ రుచి, పుల్లని రుచి నాలుకను దానికి బానిసలుగా మార్చడంలో ఆశ్చర్యం లేదు.

**ఊరగాయలు గౌట్ కు మంచివని**

అయితే ఈ అన్ని సందర్భాల్లో, రోజూ ఊరగాయ తినడం శరీరానికి ఆరోగ్యకరంగా ఉంటుందా? పుల్లని రుచి కలిగిన ఆహార పదార్థం కాబట్టి ఊరగాయలు గౌట్‌కు మంచివని కొందరు అనవచ్చు. భారతీయ ఊరగాయల్లో సోడియం పుష్కలంగా ఉంటుంది.

**చాలా ఉప్పు, నూనె**

దీనికి కారణం మనం ఊరగాయలలో ఉపయోగించే అదనపు ఉప్పు. ఊరగాయలో ఫంగస్ చేరి ఊరగాయ పాడవకుండా నిరోధించడానికి, ఎక్కువ కాలం పాడవకుండా కాపాడటానికి ఎక్కువ నూనె కలుపుతారు.

**కొలెస్ట్రాల్**

ఉప్పు మరియు నూనె అధికంగా ఉండే ఆహారాలు గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయనేది సాధారణ వాస్తవం. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. మొత్తం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఈ ప్రయోజనం కోసం, నూనెను ఊరగాయలు, హైడ్రోజనేటెడ్ లేదా ట్రాన్స్ ఫ్యాట్స్ లో ఉపయోగిస్తారు. ఇది కొవ్వు రకం.

**గుండె లోపాలు**

శరీరంలో ఎల్‌డిఎల్ అని పిలువబడే తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ కొలెస్ట్రాల్ పెరుగుదలకు ట్రాన్స్ ఫ్యాట్ కారణం. దీనివల్ల గుండె



సమస్యలు, ఊబకాయం, శరీరంలో ఇతర సమస్యలు వస్తాయి.

**వాపు**

మన ఊరగాయలలో అధిక ఉప్పు పదార్థం శరీరానికి చెడ్డది. మంట, నీరు నిలుపుదల, అధిక రక్తపోటు , ఇతర సమస్యలను కలిగిస్తుంది. "ఊరగాయలలో ఉపయోగించే సుగంధ ద్రవ్యాలు జీర్ణవ్యవస్థను చికాకుపెడతాయి" అని మైక్రోబయోటిక్ న్యూట్రిషనిస్ట్ మరియు ఆరోగ్య శిక్షకుడు శిల్పా అరోరా చెప్పారు.

**కాలేయ**

అలాగే, చౌక నూనెలలో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి, ఇవి కాలేయానికి చాలా ప్రమాదకరమైనవి, విషపూరితమైనవి. కానీ ఊరగాయ తయారీదారులు వీటికి భయపడనవసరం లేదు. ఎటువంటి ఆరోగ్య ప్రభావాలు లేకుండా ఊరగాయలు తినవచ్చు. కానీ వాటిని తయారుచేసే విధానం ఆరోగ్యంగా ఉండాలి.

**ఆరోగ్యకరమైన ఊరగాయలు**

శిల్పా అరోరా ఆరోగ్యకరమైన ఊరగాయలను రుచి చూడటానికి కొన్ని మార్గాలను సూచిస్తుంది. "ఊరగాయలు కూరగాయలను పులియబెట్టడం, ఏడాది పొడవునా తినడం ఒక సాంప్రదాయ మార్గం. ఆవ నూనె మరియు సుగంధ ద్రవ్యాలు సరైన నిష్పత్తిలో తీసుకోవడం ద్వారా, ఆరోగ్యకరమైన పదార్థాలతో తయారైన ఊరగాయలు గౌట్ ఆరోగ్యంగా ఉంటాయి. ఊరగాయలో కలిపిన కూరగాయలు పుల్లని రుచిని కలిగి ఉంటాయి, ప్రేగులలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను ఉత్పత్తి చేస్తాయి. శరీరాన్ని ఉత్తేజపరుస్తాయి. ఊరగాయ తినాలనుకునే వారికి, శిల్పా సలహా "సరైన పదార్థాలను జాగ్రత్తగా జోడించి మితంగా తీసుకోండి" అని చెప్పారు. ఆరోగ్యకరమైన పద్ధతిలో తయారైన ఊరగాయలు ఆరోగ్య రుగ్మతలకు భయపడకుండా తినవచ్చు.

# మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు

**అసెంబ్లీలో అడిగితే సమాధానం చెప్పని హోంమంత్రి**

**మదనపల్లి ఘటనపై సమాధానం చెప్పాలన్న ఎమ్మెల్యే**

**అమరావతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** ఏపీలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా ప్రభుత్వానికి కనబడుటం లేదా అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టి. చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఈ అఘాయిత్యాల గురించి అసెంబ్లీలో అడిగితే హోంమంత్రి సమాధానం చెప్పలేదని, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదంటూ సమాధానం చెప్పారన్నారు. మరి మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారిని హతమార్చి డ్రమ్‌లో కుక్కేస్తే ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు. ఇది హోంమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి కనబడుటం లేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన చంద్రశేఖర్.. ' రాష్ట్రంలో రౌడీలు లేకుండా చేస్తానంటున్న చంద్రబాబు.. అసెంబ్లీలో తన పక్కనే కూర్చోపెట్టుకుంటున్నారు. బాలకృష్ణ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయగా, ఆయన అనుచరుడు మైనర్ బాలిక జీవితాన్ని నాశనం చేశాడు. ఇలాంటి వ్యక్తులను ఏం చేయాలి?, నేరస్తులంతా క్యాష్‌ను సూట్ కేసులో పెట్టి రాజేష్ ద్వారా లోకేష్‌కి పంపుతారు. దాంతో కేసులు లేకుండా పోతున్నాయి. చిన్నపిల్లలను చెరబడుతుండే చంద్రబాబు, హోంమంత్రి తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కాసుల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. చివరికి కోటప్పకొండ దగ్గర కూడా పోలీసుల సమక్షంలో మద్యం విక్రయాలు చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రభ కడితే పోలీసులు లాఠీలతో కొట్టారు. కరెంటు కూడా వేయనీయకుండా అడ్డుకున్నారు. నియంత పోకడలు ఎల్లకాలం పని చేయవు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకున్నారు. ఆ వివరాలు ఇవ్వమని అడిగితే స్పీకర్ నన్న బెదిరించారు. చంద్రబాబు హెరిటేజ్‌దే ఇందాపూర్ డైరీ. ఊరుకొక మాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌లు పెట్టారు' అంటూ విమర్శించారు.

## కూటమి నేతలు కల్తీ రాజకీయాలు మానాలి

**మాజీ ఎంపి వంగాగీత డిమాండ్**

**కాకినాడ,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** కూటమి నేతలు కల్తీ రాజకీయాలు చేస్తే సహించేది లేదని పిఠాపురం వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ వంగా గీత హెచ్చరించారు . మహా శివరాత్రి సందర్భంగా పిఠాపురం పాదగయ సాక్షిగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తిరుమల పవిత్రతను రోడ్డెక్కించారని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తిరుమల లడ్డూ ప్రసాదంపై కల్తీ ఆరోపణలు చేసిన కూటమి నాయకులు.. ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బ్జడెట్‌లో సూపర్‌సిక్స్ పథకాలకు పంగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం.. పథకాలకు నిధులు కేటాయించకుండా గుడ్డి సున్నా చూపించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై దాడులక పాల్పడి అక్రమ కేసుల పెట్టడమేనా పరిపాలన అంటే? అని ఆమె నిలదీశారు.

## జెఇఇ టాపర్స్‌కు జగన్ అభినందనలు

**అమరావతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** జేఈఈ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కఠినమైన పోటీ పరీక్ష అయిన జేఈఈలో ప్రతిభ కనబరిచి ఉన్నత ర్యాంకులు సాధించడం విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా వారికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చిన ఈ ప్రతిభావంతులైన విద్యార్థులు భవిష్యత్తులో దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ, వారి విద్యాభ్యాసం, భవిష్యత్తు ప్రయాణం విజయవంతంగా కొనసాగాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, రాష్ట్ర యువత ఇలాగే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

**మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ వెల్లడి**

**హైదరాబాద్,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.పురపాలక శాఖపై మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వటైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్‌ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలో అక్రమాలు

**ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు**

**హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దౌర్జన్యాలపై మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్ల దౌర్జన్యం, ఇబ్రహీం పట్నం ఎన్నిక స్టే అంశం పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..116 మున్సిపాలిటీ ,7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయి. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసి, దాడులు చేశారని మండిపడ్డారు. ఎన్నికలు సజావుగా జరగలేదు. ఇవాళ చైర్మన్ ఎన్నికలో సైతం దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. జనగామలో మహిళా కౌన్సిలర్ చేయి పట్టి లాగారు. వాళ్లకు అనుకూలంగా ఉంటే అనౌన్స్ చేస్తున్నారు. లేదంటే దాడులు, వాయిదాలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం పనితీరు నామ్ కే వాస్తేగా ఉంది. ఇబ్రహీంపట్నంలో ఎన్నిక అయ్యాక కోర్టు స్టే అని ఆపారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

**హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష**



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్ధిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్ధిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించి ఆ లబ్ధిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్ధిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్ధిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# బాలిక హత్యపై మదనపల్లెలో ఉద్రిక్తత

**హైవేను దిగ్బంధించిన ప్రజలు... నిందితుడిని ఉరితీయాలంటూ ఆందోళన**



**అన్నమయ్య,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** మదనపల్లిలో అదృశ్యమైన ఓ మైనర్ బాలికను దారుణంగా హత్య చేయడంపై స్థానికంగా ఆందోళన కొనసాగుతోంది. కొన్ని గంటలుగా కదిరి– మదనపల్లి హైవే దిగ్బంధించి స్థానికులు ఆందోళన చేపట్టారు. కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి. ఆందోళనకారులతో మాట్లాడినప్పటికీ స్థానికులు మాత్రం నిందితుడ్ని ఉరి తీయాలనే డిమాండ్‌తో నిరసన చేపట్టారు. కాగా, మదనపల్లిలో అదృశ్యమైన బాలిక కేసు విషాదాంతమైంది. బాలికను హత్య చేసి డ్రమ్ములో దాచాడు నిందితుడు. మదనపల్లి పట్టణం, నీరుగట్టువారిపల్లిలోని కాట్లాటపల్లి రోడ్డులో కాపురం ఉంటున్న చేనేత కార్మికుడు గోపీనాథ్ కుమార్తె రిషిక ప్రియా(7)ను హత్య గావించబడింది. తొలుత బాలిక కన్పించకపోవడంపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనిలో భాగంగా బాలిక ఆచూకీ తెలపాల్సిందిగా పత్రికా ప్రకటన ఇచ్చారు పోలీసులు. ఆపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డీఎస్పీ మహేంద్ర సూచనల మేరకు సీఐ మహమ్మద్ రఫీ, సిబ్బందితో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఆ బాలిక హత్యగావించబడినట్లు తేలింది. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా రిషిక ప్రియను ఓ వ్యక్తి దారుణంగా చంపి డ్రమ్ములో కుక్కినట్లు గుర్తించి, హత్య జరిగినట్లు నిర్ధారించారు. మదనపల్లెలో ఆందోళన కొనసాగుతోంది. అనుమానితుడి ఇంటిని స్థానిక గ్రామస్తులు చుట్టుముట్టారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్పీతోపాటు పోలీసులు ఎంత సర్ది చెబుతున్న బాధితులు మాత్రం వినడం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు బాలిక శవాన్ని బయటకి తీయలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క నిందితుని కఠినంగా శిక్షించాలంటూ అన్నమయ్య సర్కిల్లో కొనసాగుతున్న రాస్తారోకో కొనసాగుతోంది.పాప తల్లితో ఫోన్లో మాట్లాడి న్యాయం చేస్తామని హోంమంత్రి చెప్పారు. అనుమానితుడి ఇంటి చుట్టూ ప్రజలు ,హిజ్రాలు, ప్రజాసంఘాల నాయకులు భారీగా చుట్టుముట్టారు. కర్నూలు డీఐజీ సైతం ఘటనా స్థలికి బయల్దేరి వస్తున్నట్లు తెలుస్తోంద్ని

# ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్'గా హైదరాబాద్

**లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు**

**ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణ**

**'బయో ఏషియా 2026' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్ ను 'ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్' గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే 'తెలంగాణ నెక్స్ట్ - జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026– 2030)' రూపొందించామని మంగళవారం హెచ్ఐసీ లో నిర్వహించిన 'బయో ఏషియా 2026' సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చు కునేలా తెలంగాణను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఎంఆర్ఎన్ఏ(పఖీఔం), జీన్ ఎడిటింగ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి అత్యాధునిక రంగాల్లో 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా ఇక్కడి యువతను తయారు చేస్తున్నామన్నారు. గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని అన్నారు. అందుకే... కేవలం ఉత్పత్తి చేయడమే కాకుండా, నేటి అవసరాలకు అనుగుణంగా కొత్త ఔషధాలను కనుగొనే కేంద్రంగానూ హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అలాగే... గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్ గానూ మార్చేందుకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, ఆటోమేషన్ ఇన్ బయోలాజిక్స్ మాన్యుఫాక్చరింగ్, డేటా ఆధారిత ప్రెసిషన్ మెడిసిన్ , కంప్యూషనల్ బయాలజీ, బయో మాన్యుఫాక్చరింగ్ 4.0 తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

# ఘనంగా గుంటూరులో తిరుమలశెట్టి ధాన్యశ్రీ నాలుగో జన్మదిన వేడుకలు... ....

**గుంటూరు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** గుంటూరు నగరంలో తిరుమలశెట్టి కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. చిన్నారి తిరుమలశెట్టి ధాన్యశ్రీ జన్మదిన వేడుకలు గురువారం (19-02-2026) కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఇంటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలు సాంప్రదాయబద్ధతతో పాటు కుటుంబ ఆప్యాయతలను ప్రతిబింబించాయి. వేడుకల కోసం ఇంటి ఆవరణను పూలతోరణాలు, రంగురంగుల ముగ్గులతో శోభాయమానంగా అలంకరించారు. నేలపై వేసిన ఆకర్షణీయ రంగవల్లులు, వాటిపై చల్లిన పూల రేకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారి కోసం ప్రత్యేకంగా అలంకరించిన వేదికను సిద్ధం చేసి, మధ్యలో పూలతో అలంకరించిన ఆసనాన్ని ఏర్పాటు చేశారు. ఆ వేదికపై కూర్చున్న ధాన్యశ్రీ అందరి చూపులను తనవైపు తిప్పుకుంది. కార్యక్రమం ప్రారంభంలో చిన్నారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. వేదమంత్రాల నాదం మధ్య పెద్దలు కుంకుమ, అక్షింతలు చల్లి ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, విద్యాభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ పెద్దలు వరుసగా ఆశీస్సులు అందించగా ఆ క్షణాలు కుటుంబ సభ్యులందరికీ హృదయాన్ని హత్తుకున్నాయి. ఈ సందర్భంగా పచ్చని పట్టు లంగా ఓణీ ధరించిన ధాన్యశ్రీ సంప్రదాయ ఆభరణాలతో మెరిసింది. తలలో మల్లెపూలతో చేసిన అలంకరణ ఆమెకు మరింత శోభను తెచ్చింది. అమాయకమైన చిరునవ్వులతో అతిథులను ఆహ్వానిస్తూ చిన్నారి అందరినీ ఆకట్టుకుంది. బంధువులు, స్నేహితులు చిన్నారికి బహుమతులు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఉత్సాహంగా కొనసాగించారు. "హ్యాపీ బర్త్‌డే ధాన్యశ్రీ" అంటూ కుటుంబ సభ్యులు, చిన్నారులు హర్షధ్వానాలు చేశారు. కేక్ కట్ సమయంలో చిన్నారి ఆనందం ఆ ప్రాంగణంలో ప్రత్యేక సందడిని తీసుకొచ్చింది. అనంతరం అతిథులకు స్వీట్లు, పలు రకాల వంటకాలు వడ్డించి ఆతిథ్య సత్కారం అందించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటపాటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించడంతో వేడుకలు మరింత రంజకంగా మారాయి. బెలూన్లు, రంగురంగుల అలంకరణల మధ్య చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నవ్వులు, కేరింతలతో ఆ ప్రాంగణం మార్మోగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసి ఫోటోలు దిగుతూ ఆ సంతోష క్షణాలను జ్ఞాపకాలుగా నిలిపారు. జన్మదిన వేడుకను మరింత అర్థవంతంగా మార్చేందుకు తిరుమలసెట్టి కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం కూడా నిర్వహించారు. అవసరమైన వారికి అన్నదానం చేసి తమ ఆనందాన్ని సమాజంతో పంచుకున్నారు. చిన్నారి జన్మదినాన్ని సామాజిక బాధ్యతతో అనుసంధానించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ కుమార్తె జన్మదినాన్ని ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ధాన్యశ్రీ ఆరోగ్యంగా, సంతోషంగా ఎదిగి ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలని



ఆకాంక్షించారు. సద్గుణాలతో ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి గుంటూరులో జరిగిన తిరుమలసెట్టి ధాన్యశ్రీ నాలుగో జన్మదిన వేడుకలు కుటుంబ ఆప్యాయతలు, సంప్రదాయ విలువలు, పిల్లల సందడితో కళకళలాడాయి. చిన్నారి చిరునవ్వు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం స్థానికంగా విశేషంగా నిలిచి, పాల్గొన్న వారందరికీ మరపురాని అనుభూతిని మిగిల్చింది.

# నందిగామలో దోమల పెంపక కేంద్రాలు..!



**నందిగామ ఫిబ్రవరి 18 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ పట్టణంలోని చల్లబ్రహ్మం కాలనీలో ఖాళీ స్థలాలు చెత్తాచెదారం, వర్షపు నీరు, పిచ్చి గడ్డి మొక్కలతో నిండిపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ స్థలాల్లో నీరు నిల్వవడంతో దోమల పెంపకానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని కాలనీవాసులు చెబుతున్నారు. నిల్వ నీటితో దుర్వాసన వ్యాపిస్తూ పరిసరాల్లో నివసించే ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. కాలనీలోని పలు ఖాళీ స్థలాలు సంవత్సరాలుగా యథావిధిగా ఉండటంతో చెత్త పేరుకుపోయింది. కొంతమంది వ్యక్తులు ఈ స్థలాలను చెత్త వేయడానికి ఉపయోగించుకుంటుండటంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. వర్షాల సమయంలో ఈ చెత్త కుళ్లి దుర్గంధం వ్యాపించడమే కాకుండా ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా, పొడవుగా పెరిగిన గడ్డి మొక్కల కారణంగా పాములు, విషపూరిత పురుగులు సంచరిస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. పిల్లలు బయట ఆడుకోవడానికి భయపడుతున్నారని, రాత్రివేళల్లో పరిస్థితి మరింత భయానకంగా మారుతోందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ఇళ్ల వద్ద దోమల సమస్య ఎక్కువైందని, జ్వరం వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాల యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి, చెత్తను తొలగించి మట్టితో పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. స్థలాలను శుభ్రపరిచి, నీరు నిల్వ కాకుండా చర్యలు చేపడితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. పట్టణాభివృద్ధి, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని కాలనీలో పరిశుభ్రతను నెలకొల్పాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రహదారి పక్కన పచ్చని చెట్ల నరికి వేస్తున్న దుండగులు...



**నందిగామ ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** గుడిమెట్ల నుంచి పెద్దవరం వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న పచ్చని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నరికేస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని సంవత్సరాలుగా పెరిగిన చెట్లను రాత్రివేళల్లో కోసి పడేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొన్ని రోజులుగా రహదారి వెంట పలు చోట్ల చెట్ల దిమ్మెలు కనిపించడం ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతోంది. గ్రామస్తుల కథనం ప్రకారం, ఈ చెట్లు ప్రయాణికులకు ఎండలో చల్లని నీడనిచ్చేవి. ముఖ్యంగా వేసవికాలంలో ఈ మార్గంలో ప్రయాణించే రైతులు, విద్యార్థులు, కూలీలు చెట్ల నీడలో విశ్రాంతి తీసుకునేవారు. ఇప్పుడు చెట్లు లేకపోవడంతో రహదారి పొడవునా ఎండ తీవ్రత మరింతగా అనుభవించాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. అక్రమ నరికివేత వల్ల పర్యావరణ సమతుల్యతకు కూడా భంగం కలుగుతుందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. చెట్లు వర్షపాతం, గాలి నాణ్యత, భూసారాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు గుర్తుచేశారు. ఇలాగే చెట్లను నియంత్రణ లేకుండా నరికేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అటవీశాఖ మరియు స్థానిక అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా రహదారి పక్కన మళ్లీ మొక్కలు నాటించి పచ్చదనాన్ని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. చెట్ల సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములవుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

# బ్రహ్మాబోట్లవారిపాలెంలో స్కూలు పక్కన చెత్త కుప్పలు...



**నందిగామ ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** బ్రహ్మాబోట్లవారిపాలెంలో పాఠశాల సమీపంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. స్కూలు పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహ చెత్తను బహిరంగంగా వేయడం వల్ల అక్కడ తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. రోజూ విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రదేశంలోనే చెత్త పేరుకుపోవడం ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తోంది. స్థానికుల సమాచారం ప్రకారం, కొన్ని వారాలుగా చెత్తను సమయానికి తొలగించకపోవడంతో కుప్పలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ సంచులు, ఆహార అవశేషాలు, ఇతర గృహ వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీనివల్ల దోమలు, ఈగలు అధికంగా పెరిగి పరిసర ప్రాంతాల్లో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు చెబుతున్నారు. స్కూలుకు వచ్చే చిన్నారులు ఈ దుర్వాసన మధ్య చదువుకోవాల్సి రావడం తల్లిదండ్రులను కలవరపెడుతోంది. వృద్ధులు, చిన్నపిల్లలు ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు జ్వరం, చర్మవ్యాధులు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చెత్త తొలగించి, అక్కడ చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పంచాయతీ అధికారులు తరచూ పర్యవేక్షణ చేసి శుభ్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పాఠశాల పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరం. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటేనే ప్రజల ఆరోగ్య భద్రత కాపాడబడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రైల్వే ఉద్యోగాలు అంటూ ఘరానా మోసం

## నకిలీ అపాయింట్మెంట్ లెటర్లు, ఐడి కార్డులు.

## ఉద్యోగాల భర్తీకి డబ్బులు చెల్లించి మోసపోయామంటున్న బాధితులు.

**మచిలీపట్నం ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** రైల్వే డిపార్ట్మెంట్ లో అనౌన్సర్ గా ఉద్యోగం ఇప్పిస్తానని తన దగ్గర 3.5 లక్షలు కట్టించుకున్నారని చిలకలపూడి కి చెందిన వేగేసిన గంగాభవాని ఆరోపించారు. బుధవారం మచిలీపట్నానికి చెందిన మొగనాటి కిషోర్ కుమార్ ఇంటి వద్ద మరో బాధిత మహిళ తో కలిసి ఆందోళన చేస్తూ పాత్రికేయులతో మాట్లాడారు.



రైల్వే ఐడి కార్డులు, అపాయింట్మెంట్ లెటర్లు ఇవ్వడంతో నిజమైనవే అనుకుని నమ్మి మోసపోయినట్లు చెప్పారు. ఈ వ్యవహారం లో రాజకీయ నాయకులకు ప్రమేయం ఉందన్నారు. చిన్నం చిన్న అనే నాయకుడు తాను కౌన్సిలర్ నని చెప్పి పరిచయం చేసుకుని, పార్టీలో ఉన్నామని, తప్పకుండా ఉద్యోగాలు వస్తాయి, ఓపిక పట్టండి అంటూ, తమతో ఫోన్లో, వీడియో కాల్ చేస్తూ మాట్లాడినట్టు చెప్పారు. మూడు సంవత్సరాలగా కాలయాపన చేయడంతో పది రోజుల క్రితం మా డబ్బులు ఇచ్చేయాలని ఇదే ఇంటికి వచ్చి పట్టు బడితే ఆయన ఆసుపత్రి లో పడుకుని, ఇంటి ముందు (కిషోర్ ఇంటి వద్ద) గొడవ చేస్తున్నారంటూ తిరిగి మా పైన, మా తల్లితండ్రుల మీద కేసు పెట్టారని వాపోయారు. మాతో పాటు పామర్రు, ఇనకుదురు,మొగల్తూరు, నరసాపురం,పాలకొల్లు,భీమవరం కాళ్ళ మండలం ప్రాంతాలకు చెందిన 15 మంది దగ్గర డబ్బులు వసూలు చేశారని తెలిపారు. చిలకలపూడి పోలీసు స్టేషన్ లో మమ్మల్ని ఉద్యోగాల పేరుతో మోసం చేశారని పిర్యాదు చేశామని, పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పటమే గాని,పట్టించుకున్నది లేదన్నారు.ఇప్పటికైనా డబ్బులు ఇస్తే చాలని మీడియా ద్వారా తమ గోడు వెల్లడిస్తున్నామన్నారు.

# కోళ్ల వ్యర్థాలు తరలిస్తే కఠిన చర్యలు

**గణపవరం ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** ఎన్ని చట్టాలు.. ఎంత నిఘా ఉన్నా కోళ్ల వ్యర్థాల రవాణా నిరాటంకంగా సాగుతోంది. ఒకవైపున పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణా ఆగడం లేదు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదమని తెలిసినా కోళ్లు, ఇతర జంతు వ్యర్థాలను యథేచ్ఛగా, పట్టపగలే దర్జాగా రవాణా చేస్తున్నారు.



ఇందుకు అవసరమైన కోళ్ల వ్యర్థాలు మన రాష్ట్రంనుంచే కాక పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుంచి కూడా వాహనాల్లో కొల్లేరు, డెల్టా ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా మాంసాహారం అధికంగా వినియోగించే ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు చికెన్ దుకాణాలు, చేపల మార్కెట్ల వద్ద దుకాణదారులు వాటి వ్యర్థాలను ప్లాస్టిక్ డబ్బాలలో వేసి ఉంచుతారు. వాటిని తరలించడానికి దుకాణదారులతో దళారులు ఒప్పందం చేసుకుని, వాటిని రాత్రి వేళల్లో రహస్యంగా సేకరించి వాటిని మినీ లారీలు, వ్యాన్లు, ట్రక్కు ఆటోల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీని నిమిత్తం వ్యాపారులకు ఏడాదికి రూ.10 నుంచి రూ.15 వేల వరకూ చెల్లిస్తుంటారు.

# 'పసుపు, కుంకుమ బండ్లకు అనుమతి తప్పనిసరి'...



**నందిగామ ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్లలో భాగంగా వచ్చే నెల 7న నిర్వహించనున్న 'పుట్టింటి పసుపు కుంకుమ బండ్ల' ఊరేగింపునకు అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ అర్జున్ స్పష్టం చేశారు. అనిగండ్లపాడు నుంచి వచ్చే బండ్ల నిర్వాహకులు ఈ నెల 26లోపు పోలీస్ స్టేషన్లో అనుమతి పత్రాలు పొందాలని సూచించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి డీజేలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు వెల్లడించారు.

# ఆర్డీటీ కోసం ఉద్యమం ఉద్ధృతం




**అనంతపురం ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** ఆర్డీటీని కాపాడుకునేందుకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని అఖిలపక్ష కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేసే వరకూ ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. ఇప్పటికై నా జిల్లా మంత్రులు, ఎంపీలు ఆర్డీటీపై కపట ప్రేమను వీడి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌కు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకపోవడాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడిలో భాగంగా అనంతపురంలోని క్లాక్‌టవర్ నుంచి ర్యాలీగా పోస్టల్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల వద్దకు అఖిలపక్ష కమిటీ నాయకులు చేరుకుని రోడ్డు మీద బైఠాయించి ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, తదితరులు మాట్లాడారు. 60 ఏళ్లుగా పేదలకు విద్య, వైద్య, ఆర్థికాభివృద్ధి సాధనకు పాటుపడుతున్న ఆర్డీటీని జిల్లా నుంచి పంపించేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎక్కడున్నావంటూ ప్రశ్నించారు. లక్షల మంది పేదలకు జీవనాధారమైన ఆర్డీటీ అంశంపై పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో ఏ ఒక్కరూ చర్చ లేవనెత్తకపోవడంతో పాలకుల నిజ స్వరూపం బయటపడిందన్నారు. నిజాయితీతో, నిబద్ధతతో సేవలందిస్తున్న ఆర్డీటీని కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటాలకై నా సిద్ధమన్నారు. అఖిలపక్ష కమిటీ చేపడుతున్న ఉద్యమాలకు అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐఎంఎల్ లిబరేషన్, ఐఎఫ్‌టీయూ, ప్రజాసంఘాల నాయకులు రమణయ్య, ఇమాం, వేమన, సురేష్, కుంటిమద్ది ఓబులేసు, ఐఎంఎం బాషా, సుగమంచి శ్రీనివాసులు, శిరిషాల అంజి, హరినాథరెడ్డి, వసంతకుమార్, రాజేష్, హనుమంతు, కృష్ణారెడ్డి, వెంకటేష్, విశ్వనాథ్, ముసలయ్య, ముత్యాలమ్మ, శాంతమ్మ, నారాయణస్వామి, ఓబులేసు, సూర్యనారాయణ, ఆది, రామాంజనేయులు, నాగముని, హనుమంతు, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తపస్సు కాల దీక్షలు

## సుమారు లక్ష మందికిపైగా దీక్షల స్వీకరణ

## 40 రోజులపాటు విశ్వాసుల దీక్షలు



**దెందులూరు ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** ప్రభువు ఏసుక్రీస్తు ఎడారికి వెళ్లి 40 రోజుల పడిన శ్రమలను అనుసరించి క్రైస్తవులు అనునిత్యం ప్రార్థిస్తూ, ఉపవాసం చేస్తూ తపస్సుకాల దీక్షలు చేస్తారు. నేటి నుంచి ఈ దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని క్రైస్తవ సంఘాలతో కలిపి లక్ష మందికిపైగా ఈ తపస్సు కాల దీక్షలు స్వీకరించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తపస్సు కాల దీక్షలను ఫాదర్ ఐ.మైఖేల్ ప్రారంభించారు. 1992వ సంవత్సరంలో భీమవరం ఆర్‌సీఎం విచారణ వేంపాడులో అప్పట్లో ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి జాన్ ములగాడ ప్రోత్సాహం, సహాయ సహకారాలతో ఆరుగురితో తపస్సు కాల దీక్షలను ప్రారంభించారు. జాన్ ములగాడ ప్రస్తుత ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు సహాయ సహకారాలతో అన్ని క్రైస్తవ సంఘాలతో కలిపి ప్రస్తుతం లక్షకుపైగా తపస్సు కాలదీక్షలు చేపడతున్నారు.

# చిన్ననాటి నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలి: జేసీ ఇలక్కియ...



**నందిగామ ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** : విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలను పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పెనుగంచిప్రోలు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, పిల్లలకు తప్పనిసరిగా బిళ్లలను వేయించాలని ఆమె సూచించారు.

# టెన్త్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు



**రాజమహేంద్రవరం ఫిబ్రవరి 18 (నేటి మనదేశం ప్రతినిధి):** మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. కలెక్టరేట్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, శానిటేషన్, భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే విధానంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. వైద్యశాఖ ద్వారా అత్యవసర వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లావ్యా ప్తంగా ఈ పరీక్షలకు మొత్తం 24,538 మంది విద్యార్థులు నమోదు కాగా, బాలురు 12,555 మంది, బాలికలు 11,983 మంది అని వివరించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసు దేవరావు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వీరేశ్వరస్వామివారిని దర్శించుకున్న శేఖర్ మాస్టర్

**పోలవరం ఫిబ్రవరి 19 (నేటి మనదేశం ప్రతినిధి):** మండలంలోని పట్టిసీమ వద్ద ఉన్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం డ్యాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి ఎంతోమంది చెప్పడంతో రాజమహేంద్రవరం వచ్చిన శేఖర్ మాస్టర్.. పట్టిసీమ ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.






## మృత్యుంజయ్ మనసు మారితే మంచిదే



కేవలం ఒక్క రోజు గ్యాప్ లో శ్రీవిష్ణు రెండు సినిమాలు రిలీజ్ కానుండటం గురించి అభిమానుల కంటే ఎక్కువగా డిస్ట్రిబ్యూషన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది ఎంత మాత్రం సేఫ్ కాదు. అసలే జనాలు థియేటర్లకు పెద్దగా రావడం లేదు. పిల్లలు, యువత పరీక్షల మూడ్ లో ఉన్నారు. అలాంటప్పుడు ఒకే హీరో నుంచి డబుల్ డోస్ వస్తే దాన్ని బాక్సాఫీస్ ఏ మేరకు అంగీకరిస్తుందనేది పెద్ద సవాల్. విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ రెండూ నువ్వా నేనా అనేలా ఢీ కొట్టేందుకు రెడీ కావడం ఊహించని ట్విస్టు. అయితే ఫ్యాన్స్ రిలీఫ్ అయ్యేలా ఒక కీలక పరిణామం చోటు చేసుకోవచ్చని అంటున్నారు. దాని ప్రకారం మృత్యుంజయ్ ఈ క్లాష్ నుంచి తప్పుకుని మార్చి 6కి వెళ్లడం దాదాపు ఖాయమని ఫిలిం నగర్ టాక్. ముందుగా ఒప్పందం జరిగినప్పటికీ ఓటిటి సంస్థతో మాట్లాడుకుని ఈ మేరకు నిర్ణయం మార్చుకున్నారని వినికిడి. దీనికి సంబంధించిన అనౌన్స్ మెంట్ ఇవాళ జరిగే విష్ణు విన్యాసం ట్రైలర్ లాంచ్ లో ఉండొచ్చని అంటున్నారు. ఒకవేళ నిజమే అయితే శ్రీవిష్ణుకి పెద్ద ఊరట దక్కినట్టే. ఎందుకంటే కేవలం పది రోజుల వ్యవధిలో రెండు సినిమాలకు ప్రమోషన్లు చేయడం చాలా కష్టం. పైగా ఒకదాని కోసం ప్రచారం చేస్తే ఇంకోదాని గురించి అడిగే ప్రమాదమున్న నేపథ్యంలో ఇలా సేఫ్ గేమ్ ఆడటం అందరికీ మంచిది. వేర్వేరు జానర్లు అయినప్పటికీ విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ మీద కంటెంట్ పరంగా మంచి అంచనాలు ఉన్నాయి. ఒకటి ఎంటర్ టైనర్ కాగా మరొకటి క్రైమ్ థ్రిల్లర్. శ్రీవిష్ణు ఫుల్ కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. గత ఏడాది సింగిల్ రూపంలో డీసెంట్ సక్సెస్ అందుకున్నాక మరో పెద్ద బ్రేక్ కోసం ఎదురు చూస్తున్న టైంలో ఇలా జరగడం శ్రీవిష్ణుకి తొలుత ఖంగారు కలిగించింది. ఏం చేయలేని నిస్సహాయతలో ఈ మాత్రం మార్పు జరగడం శుభ పరిణామం. అఫీషియల్ అయ్యాక మరింత క్లారిటీ వస్తుంది కాబట్టి అప్పటిదాకా వెయిట్ చేయాలి. వచ్చే వారం ఫిబ్రవరి 27 విష్ణు విన్యాసం, మార్చి 6 మృత్యుంజయ్ దాదాపు ఫిక్సైనట్టేనని టాక్.

## చేదుగా ఉన్నా నిజం చెప్పిన దిల్ రాజు



ఒకప్పుడు నిర్మాతలకు విపరీతమైన గౌరవం ఉండేది. పరిశ్రమను పోషించేది వాళ్లే కాబట్టి హీరో హీరోయిన్ దగ్గర నుంచి సాంకేతిక నిపుణులు, లైట్ బాయ్స్ వరకు ప్రతి ఒక్కరు వాళ్ళను దేవుళ్ళుగా భావించేవారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ ఓ సందర్భాల్లో కింద కూర్చుంటే, కొందరు ప్రొడ్యూసర్లు వాళ్ళ ముందే కుర్చీల్లో ఉన్నా ఏమి అనుకోకుండా పరస్పరం సంస్కారం చూపించిన గొప్ప రోజులు ఒకప్పుడు ఉండేవి. కానీ ఇప్పుడు అలా లేదు. స్టార్లు, డైరెక్టర్లకు భయపడే రోజులు వచ్చాయి. వందల కోట్లు పెడుతున్నా, ఎంత అగ్ర నిర్మాత అయినా సరే వీళ్ళ మాటను జవదాటే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇప్పుడీ ప్రస్తావనకు కారణముంది. ఇటీవలే ప్రముఖ సీనియర్ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు కూర్గ్ లో నిర్మించిన రిసార్ట్, స్పాలను ప్రారంభించేందుకు తెలుగు తమిళ ఇండస్ట్రీలకు చెందిన సెలబ్రిటీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వాళ్లలో సూపర్ స్టార్ రజనీకాంత్ ఉన్నారు. ఇందులో పాల్గొన్న దిల్ రాజు కొన్ని చేదు నిజాలు చెప్పారు. ఒకప్పుడు నిర్మాతలు అందరినీ శాసించే వారని, కానీ ఇప్పుడు డబ్బులు తీసుకున్న వాళ్లే ఇచ్చిన వాళ్ళను శాసించే స్టేజికి వచ్చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు దిల్ హిందీ రీమేక్ హక్కులను ఉచితంగా ఇవ్వాలనుకున్న ఉదంతాన్ని గుర్తు చేసుకున్నారు. సింపుల్ గా చెప్పినా ఆయన మాటల్లో నిగూడార్థం ఉంది. ప్యాన్ ఇండియా మార్కెట్ లో నిర్మాతలు నలిగిపోతున్నారు. కోట్లకు కోట్లు మంచి నీళ్ళలా ఖర్చువుతున్నా అనుకున్న టైంకి సినిమాలు రిలీజ్ చేయలేక, వాటి మీద వడ్డీలు కట్టలేక, వాయిదాలు, కోర్టు కేసులంటూ మాములు నరకం చూడటం లేదు. ఇంత భరించినా సినిమా ఏ మాత్రం అటుఇటు అయినా మళ్ళీ పెట్టుబడి పుట్టలేని పరిస్థితుల్లో ఉన్న వాళ్ళు ఎందరో. చెప్పుకుంటూ పోతే కొన్ని వందల ఉదాహరణలు కనిపిస్తాయి. దిల్ రాజు అన్నట్టు ఒకప్పటి రోజులు మళ్ళీ వస్తే ఎంత బాగుంటుందో. వినడానికి సొంపుగా ఉన్నా ఇప్పుడప్పుడే ఇవన్నీ మారేది కాదు కానీ, హీరోలు, దర్శకుల ఆలోచనా ధోరణి ఎంతో కొంత ఛేంజ్ వస్తే మంచిదే.

## రామ్ ఫలితమే సంతోష్ శోభన్ చూస్తాడా



గత ఏడాది సెప్టెంబర్ లో ఆంధ్రకింగ్ తాలూకా రిలీజైనప్పుడు పాజిటివ్ రివ్యూలు వెల్లువెత్తాయి. మౌత్ టాక్ కూడా బాగానే ఉంది. అందరు హీరోల అభిమానులు చాలా మంది అందులో కంటెంట్ కి పర్సనల్ గా కనెక్ట్ అయిపోయి దర్శకుడు మహేష్ బాబు, హీరో రామ్ మీద ప్రశంసలు గుప్పించారు. తీరా చూస్తే బాక్సాఫీస్ వద్ద రివర్స్ ఫలితం వచ్చింది. బొమ్మ ఆడలేదు. కనీసం యావరేజ్ అవుతుందనుకుంటే కలెక్షన్లు సారీ చెప్పేశాయి. దీంతో రామ్ నిరాశ చెందాడు. ఆన్ లైన్ పొగడ్తలకు, గ్రౌండ్ రియాలిటీకి చాలా తేడా ఉందని ఇండస్ట్రీ జనాలకు అర్థమయ్యింది. అయినా సరే ఇప్పటికీ ఆంధ్రకింగ్ తాలూకా డీసెంట్ మూవీగానే నిలుస్తుంది. తాజాకా కపుల్ ఫ్రెండ్లి చూస్తుంటే రామ్ చవిచూసిన అనుభవమే సంతోష్ శోభన్ కు దక్కుతుందానే అనుమానం కలుగుతుంది. ఎందుకంటే ప్రీమియర్ల దగ్గరి నుంచే ఈ సినిమాకు సానుకూల స్పందన ఉంది. ఎమోషనల్ డ్రామాని బాగా చూపించారంటూ మూవీ లవర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రమోషన్ల కోసం సంతోష్ శోభన్, మానస వారణాసి కంటిన్యూగా ట్రిప్పులు కొడుతూనే ఉన్నారు. కానీ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా మేజిక్ జరగడం లేదు. నగరాల్లో మల్టీప్లెక్సులు మినహాయించి బిసి సెంటర్లలో రెస్పాన్స్ అటుఇటుగానే ఉంది. టైటిల్ తో పాటు కంటెంట్ మరీ ఎక్కువ ఎమోషనల్ గా ఉండటం ఫ్యామిలీస్, మాస్ ని దూరం పెట్టినట్టు ఉంది. దీన్ని బట్టి ఒకటి అర్థం చేసుకోవాలి. మంచి సినిమా తీసినంత మాత్రాన భారీ డబ్బులు వచేస్తాయన్న గ్యారెంటీ లేదు. ఏ అంచనాలు లేకుండా లిటిల్ హార్ట్స్ ముప్పై కోట్లు లాగేసింది. రాజు వెడ్స్ రాంబాయి మొత్తం పెట్టుబడి ఒక్క నైజామ్ నుంచే వెనక్కు వచ్చింది.

## 'ఫంకీ'తో లాభపడ్డ ఒకే వ్యక్తి



వేలంటైన్స్ డే వీకెండ్లో మంచి అంచనాల మధ్య విడుదలైన చిత్రం.. ఫంకీ. యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న విశ్వక్సేన్‌ను హీరోగా పెట్టి 'జాతిరత్నాలు' దర్శకుడు అనుదీప్ కేవీ రూపొందించిన చిత్రమిది. టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్నిప్రొడ్యూస్ చేశాడు. కానీ ఈ మూవీ అంచనాలను అందుకోలేకపోయింది. రివ్యూలు మరీ దారుణంగా వచ్చాయి. టాక్ కూడా ఏమంత బాగా లేదు. వీకెండ్లోనే నిలబడలేకపోయిన 'ఫంకీ'.. సోమవారం నుండి క్రాష్ అయిపోయింది. మినిమం ఆక్యుపెన్సీలు కరవైన పరిస్థితి. ఈ మూవీ అత్యధికంగా డ్యామేజ్ చేసింది దర్శకుడు అనుదీప్‌కే. 'జాతిరత్నాలు' తర్వాత 'ప్రిన్స్'తో అంచనాలను అందుకోలేకపోయిన అనుదీప్.. 'ఫంకీ'తో పుంజుకుంటాడనుకున్నారు. కానీ 'ప్రిన్స్' మూవీనే నయం అనే టాక్ వచ్చింది. అనుదీప్ ఒక జోన్లో ఉండిపోయాడని.. దాన్ని మించి సినిమాలు తీయలేడనే అభిప్రాయం బలపడిపోయింది. ఇక్కడి నుంచి కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడం సవాలే. ఇక ఆల్రెడీ హ్యాట్రిక్ ఫ్లాపులు ఎదుర్కొన్న విశ్వక్ సేన్ కు కూడా 'ఫంకీ' రిజల్ట్ పెద్ద ఎదురుదెబ్బే. కొంత కాలంగా సక్సెస్ రేట్ బాగా పడిపోయి ఇబ్బందిపడుతున్న నాగవంశీకి కూడా ఇది షాకే. 'అనగనగా ఒక రోజు' విజయానందాన్ని 'ఫంకీ' ఆవిరి చేసింది. ఐతే మిగతా అందరికీ మైనస్సే అయినా.. హీరోయిన్ కాయదు లోహర్‌కు మాత్రం 'ఫంకీ' ప్లస్ అయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. సినిమా ఆడకపోయినా.. 'ఫంకీ'తో జనాల దృష్టిలో పడింది. సినిమాకు ఆమె అందం, అభినయం ఆకర్షణగా నిలిచాయి. ప్రతి సన్నివేశంలోనూ హుషారుగా కనిపిస్తూ, నటిస్తూ ఆమె ఆకట్టుకుంది.



# బిజినెస్ న్యూస్



## భారత ఏఐ ప్రయాణంలో మేం కూడా..: గూగుల్ సీఈఓ




భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోందని గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. ఏఐ వినియోగంతో మరికొన్నేళ్లలో భారత్ మరింత ముందుకువెళ్తుందని తాను నమ్ముతున్నానని.. అందువల్లే ఆ దేశంతో భాగస్వామిగా ఉండాలనే స్పష్టమైన ఆశయంతో ఉన్నామన్నారు. ఏఐ సమిట్‌పై కాలిఫోర్నియా నుంచి జాతీయ మీడియాతో వర్చువల్‌గా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఈ మార్పు సాధ్యం కావడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థిరమైన పెట్టుబడులు, డేటాసెంటర్‌ల ఏర్పాటు, స్థానిక భాగస్వాములతో కలిసి పరిశోధనలు నిర్వహించడం, దేశంలోని ప్రతిభావంతులైన యువతకు దేశ, విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు సృష్టించడం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. భారత్‌లో క్లౌడ్ రీజియన్‌ను స్థాపించడానికి గూగుల్ రిలయన్స్ జియో తో కలిసి పనిచేస్తోందని పిచాయ్ పేర్కొన్నారు. ఇందులోభాగంగా రాజస్థాన్‌లో 150 మెగావాట్ల పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేసే ప్రాజెక్ట్‌లను ఏర్పాటుచేస్తోందన్నారు. భారత్‌లో గూగుల్ డేటా సెంటర్‌ను విస్తరించడానికి అదానీ, క్లీన్‌మాక్స్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరుచుకున్నట్లు తెలిపారు. భారత వినియోగదారుల కోసం మౌలిక సదుపాయాలే కాకుండా ఏఐ-ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి గూగుల్ పనిచేస్తోందన్నారు. దిల్లీలో జరుగుతోన్న అంతర్జాతీయ ఏఐ సదస్సులో పాల్గొనడానికి గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ నేడు భారత్‌కు చేరుకున్నారు. ఏఐ సదస్సు కోసం భారత్‌కు తిరిగిరావడం సంతోషంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఆయన సమిట్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు.

## చాకు విక్రయాలు..

### బ్లింకిట్‌పై కేసు నమోదు




క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ పై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో ఫోల్డింగ్ పాకెట్ చాకుల (దీబ్‌శీఅ ఖఅఱఅజవం)ను విక్రయించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల దేశరాజధానిలో జరిగిన రెండు వేర్వేరు హత్య కేసుల్లో నిందితులు ఉపయోగించిన కత్తులను బ్లింకిట్ నుంచి కొనుగోలు చేసినట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, 7.62 సెం.మీ పొడవు, 1.72 సెం.మీ వెడల్పు గల బ్లేడ్లు ఉన్న ఫోల్డింగ్ పాకెట్ చాకులను మాత్రమే ఆన్‌లైన్‌లో విక్రయించాలి. కాగా నిందితులు వినియోగించిన చాకులు 8సెం.మీ పొడవు, 2.5సెం.మీ వెడల్పుతో ఉన్నాయి. దీంతో ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా వీటిని విక్రయిస్తున్నందుకు ఆయుధ చట్ట ఉల్లంఘన కింద పోలీసులు బ్లింకిట్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం దిల్లీలోని అన్ని బ్లింకిట్ స్టోర్లపై దాడి చేసి..55కి పైగా చాకులను స్వాధీనం చేసుకున్నారు. ఇదీ చదవండి: యూట్యూబ్ డౌన్.. లక్షలాది మంది యూజర్ల ఫిర్యాదు

## వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్‌తో ఇన్ఫినిక్స్ నుంచి కొత్త ఫోన్



చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ దేశీయ మార్కెట్‌లోకి కొత్త ఫోన్ విడుదల చేసింది. నోట్ ఎడ్జ్ 5జీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. 1.5ని డిస్‌ప్లే, 6,500పొూష్ట్ర, 45ఔ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది. దేశీయ మార్కెట్‌లోకి ఈ ఏడాది ఇన్ఫినిక్స్ నుంచి వస్తున్న తొలి ఫోన్ ఇదే కావడం గమనార్హం. లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది.

ఫోన్ ధర ఎంతంటే..

ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 6జీబీం128 జీబీ వేరియంట్ ధర రూ.21,999గా నిర్ణయించారు. 8జీబీం128జీబీ వేరియంట్ ధర రూ. 23,999, 8జీబీం256 జీబీ వేరియంట్ ధర రూ.25,999గా కంపెనీ పేర్కొంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లతో రూ.2000 వరకు డిస్కౌంట్ లభిస్తుంది. 12 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐని కూడా ఆఫర్ చేస్తున్నారు.

ఫోన్ ప్రత్యేకతలు

ఈ ఫోన్‌లో 6.78 అంగుళాలు, 1.5ఖ అమోలెడ్ 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, 120ఎఓ రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 7ఐ గోరిల్లా గ్లాస్‌ను అమర్చారు. ఐపీ 65 రేటింగ్‌తో వస్తోంది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. 13 ఎంపీ సెల్ఫీ కెమెరాను అమర్చారు. మీడియాటెక్ డైమెన్‌సిటీ 7100 ప్రాసెసర్‌ను అమర్చారు. ఫోన్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 16తో పనిచేస్తుంది. మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, 5 ఏళ్ల వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. ఈ ఫోన్ సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లార్ బ్లూ, లూనర్ టైటానియం రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, ఇన్ఫినిక్స్ వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో నేటి నుంచే విక్రయించనున్నారు.

## యూట్యూబ్ డౌన్.. లక్షలాది మంది యూజర్ల ఫిర్యాదు




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో బుధవారం కొంతసేపు అంతరాయం నెలకొంది. వీడియోలు ప్లే కాకపోవడం, లాగిన్ అవకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో లక్షలాది మంది యూజర్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఫిర్యాదులు చేశారు. అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య తలెత్తినట్లు డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది. దాదాపు మూడు లక్షల మందికి పైగా యూట్యూబ్‌పై ఫిర్యాదులు చేసినట్లు తెలిపింది. ముఖ్యంగా యాప్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పాటు వెబ్‌సైట్, యూట్యూబ్ టీవీ సేవల్లోనూ అంతరాయం నెలకొంది. దీనిపై యూట్యూబ్ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ""రికమెండేషన్ సిస్టమ్‌లో సమస్య వల్ల యూట్యూబ్ హోంపేజీ, యాప్, యూట్యూబ్ కిడ్స్, మ్యూజిక్‌లో వీడియోలు రావట్లేదు. లాగిన్ అవలేకపోతున్నామని కూడా కొందరు చెబుతున్నారు. ఇది విస్తృత సమస్య" అని యూట్యూబ్ వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం అన్ని సేవలు యథావిధిగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది.

## ఆఖర్లో కొనుగోళ్లు.. మూడో రోజూ లాభాల్లో సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ముఖ్యంగా మెటల్, ప్రభుత్వరంగ బ్యాంక్ స్టాక్స్ సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగియగా.. నిఫ్టీ 25800 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 83,553.59 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,450.96) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 83,163.62 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత మళ్లీ లాభాల బాట పట్టింది. చివరికి 283.29 పాయింట్ల లాభంతో 83,734.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.95 పాయింట్ల లాభంతో 25,819.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4922 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వైద్యులు అందుబాటులో ఉండాలి: డీసీహెచ్ఎస్



**నరసన్నపేట, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** వైద్యులు ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ కేఎన్ విజయలక్ష్మి కోరారు. మంగళవారం నర సన్నపేట ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. విధుల్లో చేరిన రెండోరోజు నరసన్నపేట ఆసుపత్రిలో వైద్యులు హాజరు, చైల్డ్‌వార్డును పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే సమయానికి కొందరు వైద్యులు, సిబ్బంది బయటకు వెళ్లగా డీసీహెచ్ఎస్ తనిఖీ చేస్తున్నారని సమాచారం మేరకు ఉరుకులు..పరుగులతో చేరారు. అనంత˘రం వైద్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. నిబంధనలు మేరకు ఆసుపత్రిలోనే వైద్యులు, సిబ్బంది ఉండాలని, హాజరు వేసి సొంత క్లినిక్‌లకు వెళ్లరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌బాబు, వైద్యులు రమేష్, రెడ్డి భార్గవ్, మెండ సుధారాణి, చల్లా కృషి పాల్గొన్నారు.

## ఆర్టీసీకి తిరునాళ్ల ఆదాయం రూ.కోటిన్నర



**పల్నాడు జిల్లా, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఆర్టీసీకి రూ.1.50 కోట్ల ఆదాయం లభించినట్లు ఆ సంస్థ పల్నాడు జిల్లా ప్రజారవాణా అధికారి టి.అజితకుమారి మంగళవారం తెలిపారు. మహా శివరాత్రికి జిల్లా వ్యాప్తంగా 460 బస్సులను నడపటం ద్వారా 4.47 లక్షల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చామని చెప్పారు. గతేడాది 4 లక్షల మంది ప్రయాణికులను చేరవేయటం ద్వారా రూ.1.22 కోట్ల ఆదాయం లభించగా ఈ ఏడాది పెరిగిందన్నారు. నరసరావుపేట డిపో ద్వారా 3 లక్షల మంది ప్రయాణీకులను కొండకు చేరవేయటం ద్వారా రూ.90 లక్షల ఆదాయం రాగా గతేడాది 2.89 లక్షల మంది ప్రయాణికులను చేరవేసి రూ.71 లక్షల ఆదాయం ఆర్జించినట్లు చెప్పారు. చిలకలూరిపేట డిపో ద్వారా 65 వేల మంది ప్రయాణికులను చేరవేయగా రూ.12.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

## మదనపల్లి ఘటన వెనుక డ్రగ్స్ ప్రభావం
## సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు

**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** ఏడేళ్ల పసిపాపపై అత్యాచారం జరిపి, దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడు డ్రగ్స్ స్వీకరించి ఉన్నారన్న వార్త తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. తిరుపతి సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న డ్రగ్ ప్రభావం గురించి ప్రజలు ఆందోళనతో ఉన్నారని, స్కూళ్లు, కళాశాలల వద్ద డ్రగ్స్ అమ్మకాలు పెరిగాయని వివరించారు. 7 ఏళ్ల పసిపాపను సైతం కన్ను మిన్ను కానకుండా అత్యాచారానికి పాల్పడడం వెనుక గంజాయి ప్రభావం ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల కారణంగా హత్యలు, అత్యాచారాలు, దాడులు సంఖ్య పెరిగిందని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియా తీవ్రతను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పున్నయ్య కమిషన్ తరహాలో రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేయాలని మాదక ద్రవ్యాల తీవ్రతను గమనించి నిర్దిష్ట సూచనలు చేయడం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చునని అన్నారు. తాజాగా అనకాపల్లి పట్టణంలో 1000 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది అన్నారు.

విశాఖ జైలులో మాదకద్రవ్యాల నింది తులతో జైలు సామర్థ్యాన్ని మించి నిండిపోయిందని స్వయంగా జైలు సూపరిండెంట్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. టన్నుల కొద్ది గంజాయి నిల్వలు దొరుకుపోతున్నాయి అంటే రాష్ట్రంలో నేరస్తుల ప్రభావం ఎలా ఉందో అర్థమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## షర్మిల యాత్రను జయప్రదం చేయండి



**కొమరాడ, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల రాష్ట్రంలో చేపడుతున్న ఉపాధిహామీ పరి రక్షణ యాత్రను జయప్రదం చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం డిసిసి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు, లీగల్ సెల్ అధ్యక్షులు కోలా కిరణ్‌కుమార్, ఒబిసి చైర్మన్ సిరిసుపల్లి సాయి శ్రీనివాస్, యువజన అధ్యక్షులు మర్రాపు తిరుపతి, గొర్లి ధనుంజయ తదితరులు మండలంలోని అంకుళ్లవలసలో ఎంజి నరేగా బచావో సంగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005లో కాంగ్రెస్ తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తొలగించిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో భాగంగా మహాత్మా గాంధీ పేరును తొలగిం చారన్నారు. 90 శాతం నిధులు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులు తగ్గించిం దన్నారు. 40శాతం నిధుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై వేసిం దన్నారు. దీనివల్ల వేతన దారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలో 64 వేల పనులను రద్దు చేసినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే జిల్లాలో పనులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉపాధి శాఖ ఉందన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ పేదలకు ఉపాధి పనులు కరు వయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి పనులు రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాలని, దీని కోసం అంతా ఒకే తాటిపైకి రావా లని పలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర చేపడుతున్నారన్నారు. త్వరలో ఈ యాత్ర జిల్లాకు రానుందన్నారు. ఆ యాత్రలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ముద్దు... జి రామ్ జి వద్దని నినాదాలు చేశారు.

## తగ్గని చలి తీవ్రత

### అరకులోయలో 8.3 డిగ్రీలు



**పాడేరు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** మన్యంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. మంగళవారం ఉదయం కూడా పొగమంచు దట్టంగా కమ్మేసింది. పాడేరులో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగానే పొగమంచు కురిసింది. దీంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి. మంగళవారం అరకులోయలో 8.3, ముంచంగిపుట్టులో 10.2, చింతపల్లిలో 10.8, పెదబయలులో 11.0, జి.మాడుగులలో 12.5, కొయ్యూరులో 14.5, అనంతగిరిలో 16.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## హైవేపై ప్రయాణమంటే హడల్



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** జాతీయ రహదారి 516- ఈపై ప్రయాణమంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని అంత్రిగుడ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పర్యాటకులకు ఈ మార్గంపై అవగాహన లేకపోవడంతో వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పర్యాటకులు అరకులోయలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించిన తరువాత చాపరాయి జలవిహారికి వస్తుంటారు. దీంతో జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మండలంలోని అంత్రిగుడ వద్ద ప్రమాదకర మలుపు ఉండడంతో ఈ మార్గంపై అవగాహన లేని పర్యాటకులు వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెల 24న రెండు ద్విచక్ర వాహనాలు ఈ మలుపు వద్ద ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ నెల 13న రెండు ద్విచక్ర వాహనాలు ఈ మలుపు వద్ద ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గతంలో ఇదే మలుపు వద్ద 11 ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మలుపు వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

## పంచాయతీ కార్మికుల జీతాలు విడుదల

**గజపతినగరం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** గత మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న పురిటిపెంట గ్రామపంచాయతీ కార్మికుల పోరాటం ఫలించింది. కార్మికులు ప్రకటించిన ధర్నా పిలుపుతో పంచాయతీ యంత్రాంగంలో కదలిక వచ్చింది. తక్షణమే స్పందించిన అధికారులు జీతాల చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయడంతో కార్మికులు తమ నిరసనను విరమించారు. జీతాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినప్పటికీ, కేవలం హామీలతోనే కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో విసుగు చెందిన కార్మికులంతా ఏకమై, మంగళవారం ధర్నా నిర్వహించి, త్వరలోనే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్మికుల ఆందోళన తీవ్రతను గమనించిన పంచాయతీ కార్యదర్శి జగదీష్, సర్పంచ్ విజయలక్ష్మి అత్యవసరంగా చర్చలు జరిపారు.

## వెంకటాపురంలో ఎంపిడిఒ పర్యటన



**పద్మనాభం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** మండలంలోని వెంకటాపురం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.రూపేష్ మంగళవారం పర్యటించారు. వెంకటాపురం గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నట్లు ఆయన పరిశీలించారు. కొంతమంది గ్రామస్తులు తమ ఇంటి వినియోగ నీటిని నేరుగా రోడ్డు మీదకు వదులుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి చర్యల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే ఈ విధానాన్ని మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని సంబంధిత వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేశారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించి, రోడ్లపై నిలిచిన నీటిని క్లియర్ చేయాలని వెంకటాపురం గ్రామపంచాయతీలో ఖాళీగా ఉన్న గ్రీన్ అంబాసిడర్ పోస్టును భర్తీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

## 'పకడ్బందీగా టెన్త్ పరీక్షలకు చర్యలు'



**బొబ్బిలి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** వచ్చేనెల 15 నుంచి పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చేందుకు చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు మలపురెడ్డి శ్రీను అన్నారు. మంగళవారం పట్టణం, మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన నేతృత్వంలో అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా తహసీల్దారు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పరీక్షల నిర్వహణాధికారులకు సూచనలిచ్చారు. అనం తరం ఆయన మాట్లాడుతూ అన్ని పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు సరైన గాలి, వెలు తురు ఉండేలా చూడా లన్నారు. తాగునీరు, వైద్య సదుపాయం అందు బా టులో ఉంచాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంత రాయం కలగకుండా జన రేటర్ సదుపాయం కల్పించాలన్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యా ర్థులు ఎటువంటి మానసిక ఒత్తిడి గురికాకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో-2 గొట్టాపు వాసు, ఏఎస్ఐ సన్యాసి రావు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## మార్చి 16నుంచి పట్టాలెక్కనున్న
## తిరుపతి-పూరి సరికొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు



**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** వచ్చేనెల 16నుంచి తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు సరికొత్తగా(ఎరుపురంగు) పట్టాలెక్కనున్నాయి. తమిళనాడు పెరంబదూర్‌లో తయారైన ఓ రైలు సోమవారం సాయంత్రం తిరుపతి నుంచి రేణిగుంట మీదుగా నూతన కాంతులతో కళకళలాడుతున్న గ్రీన్ ఇంజన్, ఎరుపురంగులో ఉన్న 20 బోగీలతో దూసుకెళ్లింది. అందులో పైలట్లు, వెనుక సిగ్నల్‌మెన్ తప్ప ప్రయాణికులె వ్వరులేరు. ఖాళీగా దూసుకెళ్తుండడం చూపరులను ఆకట్టు కుంది. ప్రయోగాత్మకంగా కొన్ని కిలోమీటర్లు నడపడంతో పాటు ఎక్కడి నుంచి ప్రవేశ పెట్టాలో ఆ ప్రాంతానికి ముందుగానే చేర్చే క్రమంలో ఆ రైలు పరుగులు పెట్టిందని అధికారులు తెలిపారు. 17480 నెంబర్‌తో ప్రతినిత్యం ఉదయం 11.05గంటలకు తిరుపతి నుంచి పూరికి బయల్దేరుతుంది. అలాగే రాత్రి 17479 నెంబర్‌తో రాత్రి 8.05 గంటలకు తిరుపతికి చేరుకొని ఆగుతుంది. ఇలా మొత్తం నాలుగు రైళ్లు నడుస్తూ ప్రతిరోజు నిర్దేశిత సమయానికి రాకపోకలు సాగిస్తాయి.

## 10 నుంచి బిల్లుల ఫ్రీజింగ్

**చిత్తూరు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** రాబడి, ఆదాయం తగ్గుముఖం పట్టడంతో జిల్లా ఖజానాశాఖ బిల్లుల స్వీకరణ, పాసింగ్ ఆర్డర్, చెల్లింపులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర ఖజానా కార్యాలయ ఉత్తర్వుల మేరకు ఈ నెల 10వ తేదీ వరకు అందిన బిల్లులు మాత్రం ఓకే చేసింది. మిగిలిన వాటిలో కొన్ని ఖాతాల హెడ్‌లను ఫ్రీజింగ్‌లో ఉంచింది. అత్యవసర బిల్లుల మినహా మిగిలిన వాటి స్వీకరణతో పాటు చెల్లింపులపై ఆంక్షలు పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 65 శాఖలు పనిచేస్తున్నాయి. వీటికి ప్రభుత్వం 2025-26 వార్షికానికి కేటాయించిన బడ్జెట్ ద్వారా ఇంతవరకు జరిపిన చెల్లింపులు బేరీజు వేసుకుని మార్చి 31వ తేదివరకు ఏరోజుకారోజు జరిగే చెల్లింపుల విషయంలో జాగ్రత్త చర్యలు చేపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన రశీదులకు సంబంధించి జరిగిన ఖర్చులను నియంత్రించడానికి, 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కసరత్తును క్రమబద్ధంగా తయారుచేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు చెందిన బిల్లులు చెల్లించే విషయానికి వచ్చేసరికి ఆర్థిక లోటును ప్రభు త్వం తెరపైకి తెచ్చిందని పలు ఉద్యోగసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉద్యోగులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, ఆర్థిక అవసరాలకోసం పెట్టు కున్న బిల్లుల స్వీక రణకు గడువు విధించడంతో ఆ వర్గాలు ఇబ్బంది పడుతున్నాయి. ప్రభుత్వ లావాదేవీ లన్నీ ఆన్‌లైన్ విధానం ద్వారా చేపడుతున్నారు. ప్రతినెలా షెడ్యూలు మేర అన్ని శాఖల బిల్లులు హుజూర్ ఖజానా కార్యాలయం నుంచి విడుదలవుతాయి. సబ్ ట్రెజరీలో బిల్లులన్నీ మంజూరవు తుంటాయి. ఈ నెల 10 నుంచి స్వీకరణ, చెల్లింపులు ఆంక్షలకు గురయ్యాయి. వీటిలో ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లులు, టీఏ, కార్యాలయ నిర్వహణ, టెలిఫోన్, సర్వీస్ పోస్టేజ్, స్టేషనరీ బిల్లులూ ఉన్నాయి. ఈనెల 10వ తేది తర్వాత అందిన విద్యుత్ బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు, ఆర్జిత బిల్లుల స్వీకరణకు ఫ్రీజింగ్ ఎదురైంది.

ప్రకృతి వైపరీత్యాలు, కోర్టు, చట్టపరమైన విషయాలకు సంబంధించిన చెల్లింపులకు ఫ్రీజింగ్ నుంచి మినహాయిస్తూ ప్రభుత్వం మెమో జారీచేసింది. గౌరవవేతనం, కార్పొరేషన్ల జీతాల బిల్లులు, ఐటీ, జీఎస్టీ, ఏపీఎస్డీసీ మొదలైన చట్టబద్ధమైన బిల్లులు, ఎఫ్‌సీ గ్రాంట్లు, నాబార్డు, ఖనిజ అభివృద్ధి నిధి వంటి స్థానిక సంస్థల సొంత నిధులకు సంబంధించిన బిల్లులకు ఫ్రీజింగ్ నుంచి మినహాయింపునిచ్చింది.

## పోస్టాఫీసు పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ఆనందపురం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్) :** కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ నార్త్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ (ఐపిఒ) జి.జగదీశ్వరరావు కోరారు. మంగళవారం రెడ్డిపల్లి సబ్ పోస్టాఫీస్ పరిధిలోని కుశులువాడ, శిర్లపాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి గ్రామీణ ప్రజలకు పోస్టల్ పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లల భవిష్యత్‌కు అత్యుత్తమమైన పథకమని, దీనిపై 8.2 శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ద్వారా 60 ఏళ్లు పైబడిన వారికి 8.2 శాతం వడ్డీతో త్రైమాసిక ఆదాయం అందుతుందని చెప్పారు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై 7.7 శాతం వడ్డీతో ఐదేళ్లకు సురక్షితమైన పెట్టుబడి లభిస్తుందని, కిసాన్ వికాస్ పత్రలో పెట్టిన డబ్బు సుమారు 115 నెలల్లో రెట్టింపు అవుతుందని వివరించారు. పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీమ్ ద్వారా 7.4 శాతం వడ్డీతో నెలవారీ స్థిర ఆదా యం పొందవచ్చని, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో 7.1 శాతం వడ్డీతో దీర్ఘకాలిక పన్ను రహిత పొదుపు సాధ్యమవు తుందని తెలిపారు. రికరింగ్ డిపాజిట్‌పై 6.7 శాతం వడ్డీతో నెలసరి పొదుపు, టైమ్ డిపాజిట్ పథకాలపై ఒకటి నుంచి ఐదేళ్ల కాలానికి 6.9 నుంచి 7.5 శాతం వరకు వడ్డీ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుశులువాడ, శిర్లపాలెం, గొట్టిపల్లి బిపిఎంలు కె.ప్రసన్న, టి.అచ్చితరావు, ఎస్‌వైఇడి, నూర్జహాన్, ఎబిపిఎం డబ్బీరు శ్రీనివాసరావు, రెడ్డిపల్లి సబ్ పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు చలమలశెట్టి ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత



**మచిలీపట్నంఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బందరు మండలం పోతేపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదములో సర్వము కోల్పోయిన కటికల సుబ్బారావు కుటుంబానికి చలమలశెట్టి ఛారిటబుల్ ట్రస్ట్ నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి, దుస్తులను బాధితుని అందించారు. తోట రాజేష్, పోతేపల్లి జనసేన పార్టీ ఇన్చార్జ్ కమ్మిలి మధు, టి.డి.పి పార్టీ ఇన్చార్జ్ శ్రీపతి చంద్రబాబు (ఎక్స్ సర్పంచ్) పోతేపల్లి, ట్రస్ట్ సభ్యులు చిలంకుర్తి వాసు, ట్రస్ట్ మేనేజరు చలమలశెట్టి పాండురంగారావు సభ్యులు కలసి ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజరు మాట్లాడుతూ అగ్ని బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చలమలశెట్టి ఛారిటబుల్ ట్రస్ట్ వారు సమాజనికి చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ, వీరిని ఆదర్శంగా తీసుకుని ఇతరులు కూడా బాధితులను సత్వరం ఆదుకోవాలని కోరారు.

## పల్నాడు జిల్లాలో ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఉద్యోగి



**నరసరావుపేట, ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లాలో ఓ అవినీతి తిమింగలాన్ని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన పలనాడు జిల్లా సత్తనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలంలో బుధవారం చోటు చసుకుంది. వివరాల్లోకెళ్తే.. నకరికల్లు మండలం చేజర్ల అసిస్టెంట్ ఎలక్ట్రికల్ లైన్మెన్ నాగేంద్రబాబు 70వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. గ్రామానికి చెందిన బాధితుడు యోహాన్ అగ్రికల్చరల్ ట్రాన్ఫార్మర్ కనెక్షన్ కొరకు నాగేంద్రబాబును సంప్రదించాడు. కనెక్షన్ కొరకు 70వేలు ఇవ్వాలని బాధితుడిని డిమాండ్ చేశాడు. ఈ మొత్తాన్ని నాగేంద్రబాబు తండ్రి శ్రీనివాస్ కు అందించాలని తెలిపాడు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వలపన్ని నాగేంద్రబాబును పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముస్లిం మైనారిటీల ఆస్తులను కాపాడాలంటూ ధర్నా



**నరసరావుపేట, ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ముస్లిం మైనారిటీల ఆస్తులను కాపాడాలంటూ పలు ముస్లిం సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించారు. ఈ ఘటన పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ములకలూరు వద్ద బుధవారం చోటుచేసుకుంది. సుమారు 10 ఏళ్ల క్రితం ముస్లిం మైనారిటీ బాల బాలికల వసతి గృహం, ఐటిఐ కళాశాలను నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదని నేటికీ కళాశాలకు ఉద్యోగులను నియమించలేదని తెలిపారు. భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఇటీవల ఈ భవనాలను కేంద్రీయ విద్యాలయాలకు కేటాయించాలని అధికారులు తీసుకున్న నిర్ణయం పై ముస్లిం సంఘం నాయకులు మండిపడ్డారు. దీంతో భవనాల వద్ద సత్తనపల్లి-నర్సరావుపేట ప్రధాన రహదారిపై ముస్లిం నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఆ మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ముస్లిం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు ముస్లిం మైనారిటీల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని అన్నారు. తాసిల్దార్, రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చలు నిర్వహించారు.

## నరసాపురంలోనే వశిష్ట వారధి నిర్మించాలి




**నరసాపురం ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉమ్మడి గోదావరి జిల్లాలను అనుసంధానం చేస్తూ గతంలో వశిష్ట నదిపై నిర్మించతలపెట్టిన వారిధిని నరసాపురం పట్టణ పరిధిలోనే వెంటనే నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంకెం సీతారామ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి బాబి ఆధ్వర్యంలో వారధి నిర్మాణం కోరుతూ పంటురేవు వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భూమిపూజ చేశారన్నారు. పట్టణ పరిధిలో వంతెన నిర్మాణం చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో రాజులంకకు మార్చారని.. దీన్ని ఉపసంహరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైతే దీనిపై తమ ఉద్యమం తీవ్రం చేస్తామన్నారు.

# కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణలో అధికారుల వైఫల్యం

**తిరునాళ్లలో చిరు వ్యాపారుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడిన కూటమి నాయకులు**

**వైసీపీకి చెందిన గోనేపూడి ప్రభవద్ద లాఠీ చార్జ్ చేసిన ఎస్సై పై చర్యలు తప్పవు**

**విప్పర్లలో క్యాసినో ఏర్పాటుతో కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడిన కూటమి నాయకులు**



**నరసరావుపేట, ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కోటప్పకొండ తిరుణాల నిర్వహణలో అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజాప్రతినిధుల వైఫల్యంతో పూర్తిగా వైఫల్యం చెందారని వైసిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... కొత్త కొత్త ప్రయోగాలు చేసి అధికారుల సమన్వయ లోపంతో భక్తులను ఇబ్బందులకు గురి చేశారు అన్నారు. మెట్ల మార్గంలో వెళ్లే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. నిత్యం పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అవుతున్న పట్టించుకున్న నాధుడే లేడు అన్నారు. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవటంతో భక్తులను మెట్ల మార్గంలో పంపించటం ద్వారా ఊపిరాడక ఓ బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్ళటం అధికారుల పనితరుకు నిదర్శనం అన్నారు. కొండకు వచ్చే భక్తులు తిరిగి వెళ్ళేటప్పుడు బస్సుల కొరకు కిలోమీటర్ల దూరం నడవడం ద్వారా వృద్ధులు పిల్లలు మహిళలు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. ఎమ్మెల్యే అనుచరులు తిరునాళ్లలో చిరు వ్యాపారుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని దీంతో రంగులరాట్నం జెయింట్ వీల్ స్టాల్స్ లేకుండా తిరునాళ్ల బోసిపోయిందన్నారు. ఈ అక్రమ వసూళ్ల కోసం టిడిపి నాయకులు మూడు గ్రూపులుగా ఏర్పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు రెండేళ్లయిన కోటప్పకొండకు దేవస్థానం కమిటీని ఎందుకు ఏర్పాటు చేయలేదని గోపిరెడ్డి ప్రశ్నించారు. కోటప్పకొండ లో గడిచిన రెండేళ్లలో బాత్రూంలు తప్ప మరి ఏ అభివృద్ధి కార్యక్రమానికి నోచుకోలేదన్నారు. కోటప్పకొండ ఈవో కాంట్రాక్టర్ అవతారం ఎత్తి లక్షల రూపాయలు చేతులు మారుస్తున్నాడని దీంట్లో స్థానిక ఎమ్మెల్యేకి వాటా ఉందని అన్నారు. ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వటానికి కూడా డబ్బులు లేకుండా చేశారని అన్నారు. ఫిక్స్ డిపాజిట్ల రూపంలో ఉన్న రెండు కోట్లను జీతాల కోసం వాడుకుంటున్నారని అన్నారు. కోటప్పకొండ నిధులన్నీ ఖాళీ చేశారని కోటప్పకొండ ఆదాయంపై ఖచ్చితంగా ఆడిట్ జరగాలని డిమాండ్ చేశారు. భక్తులకు ఉచిత లడ్డు ప్రసాదం అని చెప్పి ఒక లక్ష 25 వేల లడ్డూలు తయారు చేసి కేవలం 30వేల లడ్డూలు మాత్రమే పంచారని మిగిలినదంతా సైడ్ చేశారని అన్నారు. ఎమ్మెల్యే అరవింద బాబు అక్రమ సంపాదనకు మరిగి కోటప్పకొండను అవినీతిమయం చేశాడని అన్నారు. కొండ పరిసర ప్రాంతాల్లో మూడు రోజులపాటు మద్య నిషేధం ఉన్నప్పటికీ కోటప్పకొండ లో మద్యం ఏరులై పాడినన్నారు. సాక్షాత్తు ఒక హోంగార్డు బహిరంగంగా మద్యం అమ్మటం దేనికి నిదర్శనం అన్నారు. ఇదంతా ఎక్సైజ్ అధికారులకు కనుసనల్లో జరిగిందన్నారు. గోనెపూడి నుండి వచ్చిన వైసీపీ ప్రభ వద్ద రూరల్ ఎస్సై లాఠీ చార్జ్ చేసి భక్తులను భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. రూరల్ ఎస్సై పేరు వైసిపి డిజిటల్ బుక్ లో ఎక్కించామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక చర్యలు తప్పవని హెచ్చరించారు. కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణలో వైఫల్యాలకు అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## మచిలీపట్నంలో శుభకర ఆయుర్వేద సేవలు

**18 ఏళ్లుగా ప్రజలకు నిస్వార్థ వైద్యం: డాక్టర్ రంగనాథ్.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నంలో ఆయుర్వేద వైద్య సేవలకు విశేష స్పందన లభిస్తోందని శుభకర ఆయుర్వేద వైద్యశాల వైద్యుడు రంగనాథ్ తెలిపారు. గత 18 సంవత్సరాలుగా నిరంతరంగా ప్రజలకు సేవలందించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రాచీన భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదాన్ని ఆధునిక చికిత్సా సదుపాయాలతో కలిపి ప్రజలకు చేరువ చేయడం తమ లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కేరళ తరహా పంచకర్మ చికిత్సలు, క్షారసూత్ర విధానం ద్వారా మూలవ్యాధి నివారణ, జలూక చికిత్స ద్వారా రక్తశుద్ధి, శిరోధార ద్వారా మానసిక ఒత్తిడి తగ్గింపు వంటి ప్రత్యేక చికిత్సలను అందిస్తున్నామని వివరించారు. దీర్ఘకాలిక నొప్పులు, సంధివాతం, చర్మవ్యాధులు, జీర్ణ సంబంధ సమస్యలకు సహజసిద్ధమైన మందులతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. అవసరమైన అన్ని ఆయుర్వేద ఔషధాలను స్థానికంగానే అందుబాటులో ఉంచి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించడం తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఇకపై కూడా ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



**వినుకొండ ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఈనెల 21న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను బుధవారం ఎస్పీ బీ. కృష్ణారావు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛంద్రా – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనున్నారు. ఈ సందర్భంగా హెలిపాడ్ గ్రౌండ్సు, సభాస్థలి ప్రాంతాలను, సిహెచ్సి లను, పార్కింగ్ ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డిఓ మధులత, స్థానిక అధికారులు, వినుకొండ సిఐలు ప్రభాకర్, బ్రహ్మయ్య పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం



**చినగంజాం ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకొని పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పరిషత్ ఉన్నత పాఠశాల కడవకుదురు, కొత్తపేట జడ్పీ ప్రధానోపాధ్యాయులు కుర్రా రామారావు, శ్రీనివాసరావు ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి సబ్జెక్టులో తెలుసుకోవాల్సిన మెళకువలు, పరీక్షల్లో సులభంగా మార్కులు సాధించే విధానాలను ఎంఈవో-2, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది , పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ఉచితం.. కానీ డబ్బు ఎందుకు వసూలు చేస్తున్నారు?: ఎమ్మెల్యే



**హాలహర్వి ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కర్నూలు జిల్లా హొళగుంద మండలంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులు నుంచి రూ. 500 ఎందుకు వసూలు చేస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రశ్నించారు. బుధవారం హొళగుంద మండలం మార్లమడికి గ్రామంలో వేదవతి నదిని పరిశీలించి, ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. ఉచితంగా ఇస్తామన్న ఇసుకపై.. క్షేత్ర స్థాయిలో వసూళ్లకు పాల్పడటం ఏమిటని, ఈ డబ్బులు ఎక్కడికి వెళుతుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే అదనపు వసూళ్లను ఆపాలని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌కు విన్నవించారు.

## ఆర్టీసీ బస్సులో పోయిన బ్యాగు.. మహిళకు తిరిగిచ్చిన పోలీసులు



**ఆదోని మార్కెట్ ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ మహిళా తన బ్యాగును పోగొట్టుకొని పోలీసులను ఆశ్రయించి.. తిరిగి బ్యాగు పొందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ మహిళ కౌతాళం నుంచి ఆదోనికి బుధవారం మధ్యాహ్నం బయలుదేరింది. బస్సు ఆదోని పట్టణానికి చేరుకోగానే బ్యాగును బస్సులోనే మర్చిపోయి వెళ్లిపోయింది. బ్యాగు మర్చిపోయిన విషయాన్ని గ్రహించిన మహిళ బస్టాండ్‌కు వచ్చి వెతికినా కనిపించలేదు. దీంతో ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. ఒకటో పట్టణ సీఐ చంద్రశేఖర్ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానందరెడ్డి, కానిస్టేబుల్ సజ్జన్ సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి పోగొట్టుకున్న బ్యాగును గుర్తించారు. బ్యాగులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం సీఐ సమక్షంలో బాధిత మహిళకు పోలీస్ సిబ్బంది బ్యాగును అందజేశారు.

# వైభవంగా నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవం



**మోపిదేవి ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ముందుగా యన్నం వారి కుటుంబీకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 15 రోజులపాటు అమ్మవారి గ్రామోత్సవం కొనసాగనుంది. మార్చి 4వ తేదీ రాత్రికి అమ్మవారి జాతర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ ఆకుల వెంకటరామయ్య మాట్లాడుతూ.. అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు వేసవి ఎండల నేపథ్యంలో తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. భక్తులు ఆలయ కమిటీకి సహకరించి అమ్మవారి జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుర్రా గురు ప్రసాద్, ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు, పలువురు అధికారులు, సంఘాల నేతలు, స్థానికులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

## రైతు బజార్ల ఏర్పాటుకు సన్నాహాలు



**ఆదోని మార్కెట్ ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి నియోజకవర్గంలో రైతు బజార్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య పేర్కొన్నారు. బుధవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో కలియతిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక ఏడాది దగ్గర పడుతున్న నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ఆదాయ లక్ష్యాలను త్వరితగతిన అందుకోవాలనే ఉద్దేశంతో మార్కెట్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో 73 మార్కెట్ కమిటీలు ఉండగా రూ.115 కోట్లు ఆదాయాన్ని ఆశించిందని ఆమె అన్నారు. ఆమె వెంట మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్ జిందే శారద, యార్డు కార్యదర్శి గోవిందు, సహాయ కార్యదర్శి శాంత కుమార్ తదితరులు ఉన్నారు.

## ఆదోనిలో వెలుగులోకి 1,050 ఎకరాల భూ కబ్జా వ్యవహారం..!



**ఆదోని మార్కెట్ ఫిబ్రవరి 18( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని పట్టణంలో మరో భూ కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పట్టణ శివారులోని ఇస్వీ బైపాస్ రహదారిలో శుక్రవారంపేట మారెమ్మవ్వ ఆలయం ముందు భాగంలోని సర్వే నంబర్ 314లో 1,050 ఎకరాల పోరంబోకు స్థలం కబ్జాకు గురైంది. ఇక్కడి భూమిలో గతంలో నిమ్న జాతులకు చెందిన వారికి డి-పట్టాలు జారీ చేశారు. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్ చేసిన సమయంలో ఈ భూములను పలువురు రాజకీయ నేతలు తమ పేర్లపై మళ్లించుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ వెంచర్ వేశారు. గత వారం ఎమ్మెల్యే డా. పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాదర్బార్‌లో భూ కబ్జాపై ఫిర్యాదు వచ్చిందని భాజపా నాయకులు విజయకృష్ణ, మహదేవ్, సురేష్ తదితరులు తెలిపారు. వెంచర్ వేసిన భూమిని భాజపా నాయకులు, పోలీసులు పరిశీలించారు. భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించకోవడంతో పాటు, కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని భాజపా నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు వెంచర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులివ్వలేదని పురపాలక పట్టణ ప్రణాళిక విభాగాధికారులు పేర్కొన్నారు. భూమికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అయినప్పటికీ ఈ వ్యవహారంపై విచారణ చేస్తామని ఆదోని మండల తహసీల్దార్ తెలిపారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com